https://prajapratibha.com
RNI : APTEL 2013/54721

# ప్రజా ప్రతిభ

ప్రతి అక్షరం ప్రజా పక్షం
తెలుగు దినపత్రిక

సంపుటి: 13 | సంచిక: 261 | prajapratibha.2013@gmail.com | ఎడిటర్ : దానూరి శ్రీనివాస్ | 9441500341 | వెల: రూ.5.00 | పేజీలు: 10

ఆంధ్రప్రదేశ్ Published from Andhra pradesh & Telangana శనివారం । 30 । మే । 2026





## గౌరవంగా జీవించే హక్కు వారికి కూడా ఉంది

- సెక్స్ వర్కర్లకు కూడా రాజ్యాంగ హక్కులు ఉంటాయని సుప్రీంకోర్టు స్పష్టం

2లో..

## నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది..?

- యూపిఎస్సిని చూసి నేర్చుకోండి
- విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనకు బాధ్యులెవరు..?
- నీట్ పేపర్ లీక్‌పై మరోమారు సుప్రీం ఆగ్రహం



న్యూఢిల్లీ,మే29(ప్రజా ప్రతిభ): నీట్ యూజీ పరీక్ష పేపర్ లీక్ వివాదంపై సుప్రీం కోర్టు మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పర్యవేక్షణా యంత్రాంగాలు, సంబంధిత కమిటీలు ఉన్నప్పటికీ ఇంత పెద్ద ఉల్లంఘన ఎలా జరిగిందని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇలాంటి సంఘటన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తీవ్ర మానసిక క్షోభను కలిగిస్తుందని, వారిని ఇలా నిరాశపెట్టడం సరికాదని అభిప్రాయపడింది.

మిగతా 2లో..

## హర్మూజ్ దాటిన మరో భారత నౌక

- అమెరికా-ఇరాన్ చర్చలతో తగ్గుతున్న ఉద్రిక్తతలు
- నెలల తర్వాత కదలికలోకి వస్తున్న సముద్ర రాకపోకలు
- భారత్‌కు ఎల్పీజీ, చమురు సరఫరాపై ఊరట
- ఇంకా గల్ఫ్‌లోనే ఎదురుచూస్తున్న వేల నౌకలు



న్యూఢిల్లీ, మే 29 (ప్రజా ప్రతిభ): భారత్‌కు వస్తున్న ఓ చమురు ట్యాంకర్ కీలకమైన హర్మూజ్ జలసంధిని శుక్రవారం సురక్షితంగా దాటడం అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న దౌత్య చర్చలు సానుకూల దిశగా సాగుతున్న నేపథ్యంలో గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతలు క్రమంగా తగ్గుతున్నాయనే

మిగతా 2లో..

## ఫోటోగ్రాఫర్ శ్రీనివాసరెడ్డికి ఆస్ట్రేలియా పురస్కారం

అమరావతి,మే29(ప్రజా ప్రతిభ): ప్రముఖ ఫోటోగ్రాఫర్ టి.శ్రీనివాసరెడ్డి ఆస్ట్రేలియాకు చెందిన ప్రతిష్టాత్మక 'ఆస్ట్రేలియన్ ఫోటోగ్రాఫిక్ సొసైటీ' అత్యున్నత పురస్కారం గౌరవాన్ని కైవసం చేసుకున్నారు. 2026 సంవత్సరానికి గాను ప్రపంచవ్యాప్తంగా ఈ అరుదైన గుర్తింపును ఆయన దక్కించుకున్నారు. ఇద్దరు కళాకారులు పోటీపడగా ఆయనకు ఈ అవార్డు దక్కింది. ఫోటోగ్రఫీ రంగంలో ఆయన సాధించిన విజయాలకు ఈ పురస్కారం మరింత గుర్తింపునిచ్చింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫోటోగ్రాఫిక్ సొసైటీతో తనకు దాదాపు రెండు దశాబ్దాల సుదీర్ఘ అనుబంధం ఉందని అన్నారు. గతంలో తన ప్రతిభను గుర్తిస్తూ 2016లో ఆ సొసైటీ

మిగతా 2లో..



# సైబర్ నేరాల అడ్డుకట్టకు
# ఏపీ సైబర్ గార్డ్

- 6 పిల్లర్స్ రెస్పాన్స్ టీమ్స్‌తో నేరాలకు అడ్డుకట్ట

- ప్రజలను నిత్యం అప్రమత్తం చేయాలి...సైబర్ పెట్రోలింగ్ జరగాలి
- సైబర్ మోసాలపై ఫిర్యాదు అందిన మరుక్షణమే వార్ రూంలో జీరో ఎఫ్ఐఆర్
- ఏపీలో సైబర్ నేరానికి పాల్పడితే... తప్పించుకోలేమనే భయం క్రిమినల్స్‌కు కలగాలి
- ప్రజలు నష్టపోకుండా బ్యాంకులు సహకరించాలి
- సైబర్ నేరాల అడ్డుకట్టకు పోలీసు శాఖ కార్యాచరణపై సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి,మే 29 (ప్రజా ప్రతిభ): రాష్ట్రంలో సైబర్ నేరాల అడ్డుకట్టకు జీరో ఎఫ్ఐఆర్ విధానం అమల్లోకి తేవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. బాధితులు సైబర్ వార్ రూమ్‌కు ఫోన్ చేసిన వెంటనే జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం ద్వారా బ్యాంకులను అప్రమత్తం చేసి గోల్డెన్ అవర్ టైంను వినియోగించుకుని అకౌంట్ల నుంచి డబ్బులు బదిలీ కాకుండా చూడాలని సూచించారు. సైబర్ నేరాల అడ్డుకట్టకు బ్యాంకులూ సహరించాలన్నారు. సైబర్ నేరాలపై అన్ని వర్గాల ప్రజలను నిత్యం అప్రమత్తం చేయాలని, అవగాహనా కార్యక్రమాలు పెంచాలని సీఎం సూచించారు.

పోలీస్ పెట్రోలింగ్ తరహాలోనే సైబర్ పెట్రోలింగ్ జరగాలని, ప్రజలు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా చూడాలని సీఎం సూచించారు. నేరం జరిగిన తరువాత ఫిర్యాదు రావడం, పోలీసులు విచారణ



జరపడం కంటే...అసలు నేరమే జరిగే అవకాశం లేకుండా ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. రిటైర్డ్ ఉద్యోగులను టార్గెట్‌గా చేసుకుని జరుగుతున్న నేరాల పట్ల వారికి అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. సైబర్ నేరాల అడ్డుకట్టకు తీసుకుంటున్న చర్యలపై సీఎం చంద్రబాబు సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. 6 పిల్లర్ రెస్పాన్స్ టీమ్స్‌తో వివిధ రకాల సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు తాము సిద్దం చేస్తున్న ప్రణాళికలను ముఖ్యమంత్రికి డీజీపీ వివరించారు.

### 28 జిల్లాల్లో సైబర్ యూనిట్లు... 4 రీజనల్ హబ్‌లు : డీజీపీ

ప్రజెంటేషన్‌పై డీజీపీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ..."



- తమిళనాడు పర్యటనకు వెళ్లిన లోకేష్
- కొండపైకి రోప్‌వేలో వెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు
- 420 మెట్లు నడిచి యోగ ఆంజనేయస్వామి ఆలయ సందర్శన
- లోకేష్ వెంట ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గురజాల జగన్మోహన్

## తమిళనాడులో షోలింగర్ నరసింహస్వామిని
## దర్శించుకున్న నారా లోకేష్

తమిళనాడు, మే 29 (ప్రజా ప్రతిభ): మార్గమధ్యలో భక్తులను ఆప్యాయంగా పలకరించిన మంత్రి నారా లోకేష్ తమిళనాడులో పర్యటించారు. రాణిపేట జిల్లా షోలింగర్‌లోని ప్రసిద్ధ యోగ లక్ష్మీ నరసింహ స్వామి వారిని శుక్రవారం ఉదయం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పర్యటనలో ఆయన వెంట ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గురజాల జగన్మోహన్, డాక్టర్ మురళీ మోహన్ ఉన్నారు. షోలింగర్ చేరుకున్న

మిగతా 2లో..





- సోమవారం వరకు స్పర్శ దర్శనాల నిలుపుదల
- స్వామి వారి అలంకార దర్శనాలకు మాత్రమే అనుమతి
- ఇప్పటికే ఆన్ లైన్ టికెట్లు పొందిన వారికి యథావిధిగా స్పర్శ దర్శనాలు

## శ్రీశైలంలో స్పర్శ దర్శనాలు రద్దు

శ్రీశైలం, మే 29 (ప్రజా ప్రతిభ): ప్రముఖ శైవ క్షేత్రం శ్రీశైలంలో శుక్రవారం నుంచి స్పర్శ దర్శనాలను రద్దు చేస్తున్నట్టు ఆలయ ఈవో శ్రీనివాసరావు ప్రకటించారు. శుక్రవారం నుంచి సోమవారం వరకు స్పర్శ దర్శనాలు ఉండవని ఆయన తెలిపారు. కేవలం స్వామి వారి అలంకార దర్శనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని చెప్పారు. అయితే, ఇప్పటికే ఆన్‌లైన్

మిగతా 2లో..



## పూర్వ వైభవమే లక్ష్యం..
### కాంగ్రెస్‌కు రాహుల్ కొత్త దిశానిర్దేశం

- రాహుల్‌తో షర్మిల కీలక భేటీ..
- పార్టీ బలోపేతం, ప్రజా ఉద్యమాలపై విస్తృత చర్చలు
- యువత, రైతులు, మహిళలపై ప్రత్యేక దృష్టి
- రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై సమీక్ష

న్యూఢిల్లీ, మే 29 (ప్రజా ప్రతిభ): రాహుల్ గాంధీతో వైయస్ షర్మిల భేటీ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఆసక్తి రేపుతోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా పార్టీ అధిష్ఠానం వ్యూహాత్మకంగా ముందుకెళు_న్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

ఢిల్లీలోని 10 జనపథ్‌లో శుక్రవారం జరిగిన ఈ సమావేశంలో ఏపీలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం, సంస్థాగత విస్తరణ, ప్రజా ఉద్యమాలపై విస్తృతంగా చర్చించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీని

మిగతా 2లో..

## స్వచ్ఛ గోదావరిలో
# పవిత్ర పుష్కరాలు

- కాలుష్యరహిత గోదావరి పుష్కర నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక
- ఆరు జిల్లాల్లో 262 పుష్కర పంచాయతీల గుర్తింపు
- మురుగురహిత పంచాయతీలుగా తీర్చిదిద్దాలని ఆదేశం
- మురుగు నీరు నేరుగా గోదావరిలో కలవకుండా ప్రత్యేక పర్యవేక్షణ
- మున్సిపాలిటీ సామర్థ్యానికి తగిన విధంగా మురుగు శుద్ధి ప్లాంట్ల నిర్మాణం చేపట్టాలి
- పీసీబీ నుంచి మంజూరు చేసిన రూ. 100 కోట్ల నుంచి కూడా నిధుల వినియోగం
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక ఆదేశాలు

అమరావతి, మే 29 (ప్రజా ప్రతిభ): గోదావరి పుష్కరాలను కాలుష్యరహితంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'స్వచ్ఛ గోదావరి - పవిత్ర పుష్కరాలు' పేరిట ప్రత్యేక



కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు గోదావరి పరివాహక ప్రాంతంలోని ఆరు జిల్లాల్లో గుర్తించిన 262 పుష్కర పంచాయతీలను మురుగురహితంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. గోదావరిలోకి మురుగు, పారిశ్రామిక, ఆక్వా వ్యర్థాలు చేరకుండా నిరంతర పర్యవేక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని అధికారులను

మిగతా 2లో..

## బహిరంగ మార్కెట్లో ధరల స్థిరీకరణకు చర్యలు

- బహిరంగ మార్కెట్ ధరలపై నిరంతర సమీక్ష
- ఖరీఫ్ సన్నద్ధతపై వ్యవసాయ, పౌర సరఫరాల శాఖల సమన్వయం
- వరి రకాల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాలు
- సమీక్షలో మంత్రులు అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్

అమరావతి,మే29(ప్రజా ప్రతిభ): ప్రజలకు నిత్యావసర వస్తువులు అందుబాటు ధరల్లో లభించేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో ధరల మార్పులను నిత్యం సమీక్షిస్తూ, అవసరమైన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ధరల స్థిరీకరణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల కమిటీ 8వ సమావేశం శుక్రవారం సచివాలయంలో


మిగతా 2లో..



https://prajapratibha.com RNI : APTEL 2013/54721

# గౌరవంగా జీవించే హక్కు వారికి కూడా ఉంది

- సెక్స్ వర్కర్లపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- స్వచ్ఛందంగా లైంగిక వృత్తిలో ఉన్న వారిపై కేసులు పెట్టొద్దని స్పష్టం
- పోలీసుల దాడులు, వేధింపులు చట్ట విరుద్ధమని వ్యాఖ్య
- ఫొటోలు, వీడియోలు ప్రసారం చేస్తే మీడియాపై చర్యలు తప్పవని హెచ్చరిక
- సెక్స్ వర్కర్లకు కూడా రాజ్యాంగ హక్కులు ఉంటాయని సుప్రీంకోర్టు స్పష్టం




**న్యూఢిల్లీ, మే 29 (ప్రజా ప్రతిభ):** దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన సెక్స్ వర్కర్ల హక్కుల అంశంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. స్వచ్ఛందంగా లైంగిక వృత్తిని ఎంచుకున్న మేజర్ మహిళలను నేరస్తుల్లా చూడకూడదని, వారిపై పోలీసులు కేసులు నమోదు చేయడం, దాడులు నిర్వహించడం చట్ట విరుద్ధమని స్పష్టం చేసింది. అదే సమయంలో మానవ అక్రమ రవాణా ద్వారా బలవంతంగా ఈ వృత్తిలోకి నెట్టబడిన బాధితులను ప్రత్యేకంగా గుర్తించి రక్షణ కల్పించాలని ఆదేశించింది.

స్వచ్ఛందంగా వృత్తిలో ఉన్న వారిని, బలవంతంగా దింపబడిన బాధితులను ఒకేలా చూడడం సరికాదని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యా నించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి పౌరుడికి గౌరవంగా జీవించే హక్కు ఉంటుందని గుర్తు చేసింది. సెక్స్ వర్కర్లు కూడా అదే హక్కులకు అర్హులని పేర్కొంది.

ఈ సందర్భంగా మీడియాకు కూడా సుప్రీంకోర్టు హెచ్చరికలు జారీ చేసింది. సెక్స్ వర్కర్ల ఫొటోలు, వీడియోలు ప్రసారం చేయడం, వారి వ్యక్తిగత వివరాలు బహిర్గతం చేయడం నేరమని స్పష్టం చేసింది. ఇతర పౌరుల మాదిరిగానే వారికి కూడా గోప్యతా హక్కు ఉంటుందని తెలిపింది. ఇక సంక్షేమ పథకాల అమలుపై కూడా కీలక ఆదేశాలు ఇచ్చింది. నివాస ధృవీకరణ పత్రాలు లేకపోయినా సెక్స్ వర్కర్లకు ఆధార్ కార్డులు జారీ చేయాలని యూఐడీఏఐకి సూచించింది. సరైన గుర్తింపు పత్రాలు లేవన్న కారణంతో ప్రభుత్వ పథకాల నుంచి వారిని దూరం చేయకూడదని స్పష్టం చేసింది.

మరోవైపు మానవ అక్రమ రవాణా ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించింది. అమాయక మహిళలను బలవంతంగా ఈ వృత్తిలోకి నెట్టే నేరగాళ్లను టార్గెట్ చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.



### తమిళనాడులో షోలింగర్ నరసింహస్వామిని

## దర్శించుకున్న నారా లోకేష్

మొదటిపేజీ తరువాయి..

మంత్రి లోకేష్‌కు ఆలయ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోప్‌వే ద్వారా కొండపై ఉన్న యోగ నరసింహ స్వామి ఆలయానికి చేరుకున్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ వేద పండితులు లోకేష్‌కు వేదాశీర్వచనం అందించి, శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.అక్కడి నుంచి సమీపంలోని మరో కొండపై కొలువైన యోగ ఆంజనేయస్వామిని కూడా మంత్రి దర్శించుకున్నారు. కాలినడకన 420 మెట్లు ఎక్కి ఆలయానికి చేరుకుని స్వామివారికి పూజలు చేశారు. ఆలయ అధికారులు ఆయనకు స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు. పర్యటన ముగించుకుని తిరిగి వస్తున్నప్పుడు మార్గమధ్యంలో కనిపించిన భక్తులను లోకేష్ ఆప్యాయంగా పలకరించారు.

## శ్రీశైలంలో స్పర్శ దర్శనాలు రద్దు

మొదటిపేజీ తరువాయి..

ద్వారా టికెట్లు పొందిన భక్తులకు మాత్రం యథావిధిగా స్పర్శ దర్శనాలను కొనసాగించనున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

## పూర్వ వైభవమే లక్ష్యం..

మొదటిపేజీ తరువాయి..

మరింత క్రియాశీలం చేసే అంశాలపై ప్రత్యేకంగా చర్చ జరిగినట్లు సమాచారం. రాష్ట్రంలో యువత, మహిళలు, రైతులు, నిరుద్యోగులను కాంగ్రెస్‌కు చేరువ చేసేలా కార్యాచరణ రూపొందించాలని రాహుల్ గాంధీ సూచించినట్లు తెలిసింది. ప్రజా సమస్యలపై మరింత దూకుడుగా పోరాటాలు నిర్వహించాలని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ నాయకత్వానికి దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ఇక రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, కూటమి ప్రభుత్వ పనితీరు, కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో వస్తున్న స్పందనపై కూడా సమావేశంలో సమీక్ష జరిగినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌ను రాష్ట్రంలో బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టేందుకు సమన్వయంతో పనిచేయాలని రాహుల్ గాంధీ సూచించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

## స్వచ్ఛ గోదావరిలో పవిత్ర పుష్కరాలు

మొదటిపేజీ తరువాయి..

ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో మురుగు నిర్వహణతో పాటు పారిశ్రామిక కాలుష్య నియంత్రణ కోసం ఆర్టీజీఎస్ తరహాలో ప్రత్యేక కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయనున్నారు. సీసీ కెమెరాలు, ప్రత్యక్ష మానిటరింగ్ వ్యవస్థల ద్వారా ఎక్కడ మురుగు శుద్ధి జరుగుతోంది, ఎక్కడ నేరుగా గోదావరిలోకి విడుదలవుతోందన్న అంశాలను పర్యవేక్షించనున్నారు. ఈ బాధ్యతలను ప్రధాన నదుల కాలుష్య నివారణ కోసం ఏర్పాటు చేసిన పర్యావరణ పరిరక్షణ టాస్క్‌ఫోర్స్‌కు అప్పగించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు.

గోదావరి పరివాహక గ్రామాల నుంచి రోజుకు 8.38 మిలియన్ లీటర్ల మురుగునీరు నదిలో కలుస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీనిని అరికట్టేందుకు 'వీబీ జీ రాం జీ' పథకం కింద మ్యాజిక్ డ్రెయిన్లు, కమ్యూనిటీ సోక్‌పిట్స్, ఇండివిడ్యువల్ ట్విన్‌పిట్స్ నిర్మించాలని సూచించారు. కాలువలు, డ్రెయిన్ల ద్వారా మురుగు నేరుగా నదిలో కలవకుండా పంచాయతీ స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

మున్సిపాలిటీలు, పరిశ్రమలు, ఆక్వా రంగం నుంచి భారీగా వ్యర్థాలు గోదావరిలో కలుస్తున్నాయని కాలుష్య నియంత్రణ మండలి నివేదికల్లో వెల్లడైంది. ఆరు జిల్లాల పరిధిలోని పట్టణాల నుంచి రోజుకు సుమారు 104 మిలియన్ లీటర్ల మురుగునీరు నదిలోకి వెళ్తోంది. కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి రోజుకు 13.24 మిలియన్ లీటర్ల ఆక్వా వ్యర్థాలు కూడా నదిలో కలుస్తున్నాయి. ఒక్క ఆంధ్ర పేపర్ మిల్స్ నుంచే రోజుకు 32 మిలియన్ లీటర్ల వ్యర్థాలు విడుదలవుతున్నట్లు గుర్తించారు.రాజమహేంద్రవరం, భీమవరం, తణుకు, నరసాపురం, కొవ్వూరు వంటి పట్టణాల నుంచి శుద్ధి చేయని మురుగునీరు నేరుగా గోదావరిలో కలుస్తోందని అధికారులు గుర్తించారు. రాజమహేంద్రవరం నుంచి రోజుకు 75 మిలియన్ లీటర్ల మురుగునీరు ఉత్పత్తి అవుతుండగా, అందులో 50 మిలియన్ లీటర్లు నేరుగా నదిలోకి వెళ్తున్నట్లు తెలిపారు. దీనిపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి, ప్రతి మున్సిపాలిటీలో సామర్థ్యానికి అనుగుణంగా మురుగు శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) నిర్మించాలని ఆదేశించారు. ఇప్పటికే మంజూరైన రూ.100 కోట్ల నిధులతో పాటు అవసరమైతే స్వచ్ఛాంధ్ర నిధులను కూడా వినియోగించాలని సూచించారు.

పారిశ్రామిక కాలుష్య నియంత్రణ కోసం పరిశ్రమల్లో ఆధునిక మురుగు శుద్ధి వ్యవస్థలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పరిశ్రమల మురుగు నీటి విడుదలపై ప్రత్యేక సీసీ కెమెరాలతో పర్యవేక్షణ నిర్వహించాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని, పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని సూచించారు. భక్తులు స్వచ్ఛమైన గోదావరి జలాల్లో పవిత్ర పుష్కర స్నానాలు ఆచరించేలా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. "గోదా వరి పవిత్రతను కాపాడటం అందరి బాధ్యత. కాలుష్య నివారణలో ప్రభుత్వం, స్థానిక సంస్థలు, పరిశ్రమలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలి" అని ఆయన స్పష్టం చేశారు.

## ఫోటోగ్రాఫర్ శ్రీనివాసరెడ్డికి ఆస్ట్రేలియా పురస్కారం

మొదటిపేజీ తరువాయి..

ప్రతిష్టాత్మక 'ఏపీఎస్ ఫెలోషిప్' గౌరవాన్ని అందించిందని తెలిపారు. ఆ గౌరవం దక్కిన పదేళ్ల తర్వాత, ఇప్పుడు అంతకంటే అత్యున్నతమైన 'మాస్టర్' స్థాయిని అందుకున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో లభించిన ఈ గౌరవం తన బాధ్యతను మరింత పెంచిందని, తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే అంతర్జాతీయ వేదికలపై ఎన్నో ప్రతిష్టాత్మక గౌరవాలను సొంతం చేసుకున్న ఆయన తాజా పురస్కారంతో తెలుగువారందరికీ గర్వకారణంగా నిలిచారు.

## శ్రీవాణి టిక్కెట్లలో మార్పులు

### 1గంటలోపు బుక్ చేసుకున్న వారికి 4గంటలకు దర్శనం

**తిరుమల,మే29(ప్రజా ప్రతిభ):** భక్తుల సౌకర్యార్థం శ్రీవాణి ట్రస్ట్‌కు సంబంధించిన దర్శన టికెట్ల కేటాయింపులో పలు మార్పులు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి తెలిపింది. శ్రీవాణ టిక్కెట్లు నేరుగా బుక్ చేసుకున్న వారికి అదేరోజు సాయంత్రం దర్శనం కలగనుంది. ఈ టికెట్లు ప్రతిరోజూ ఉదయం 9 గంటలకు విడుదల చేస్తారని.. మధ్యాహ్నం 1 గంటలోపు బుక్ చేసుకున్న భక్తులకు అదే రోజు సాయంత్రం 4 గంటలకు దర్శనానికి అనుమతించనున్నట్లు పేర్కొంది. కాగా ఈ విధానం జూన్ 10 నుంచి అమలులోకి రానుంది. ఈ కోటాలో బుకింగ్ కాని టికెట్లను తిరిగి కరెంట్ బుకింగ్ కోటాలో ఇస్తామని పేర్కొంది. ఈ విధానం 2027 మార్చి 31 వరకు అమల్లో ఉంటుందని తితిదే వెల్లడించింది. ప్రస్తుతం రోజుకు 1500 శ్రీవాణి టికెట్లను తితిదే ఆన్‌లైన్ ద్వారా అందుబాటులో ఉంచుతోంది. వీటిలో 500 దర్శన టికెట్లను మూడు నెలలు ముందుగానే ఆన్‌లైన్‌లో అడ్వాన్స్ బుకింగ్ కింద అందుబాటులోకి తీసుకొస్తోంది. మరో 200 శ్రీవాణి దర్శన టికెట్లను తిరుపతి విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కింద జారీ చేస్తోంది.

## బహిరంగ మార్కెట్లో ధరల స్థిరీకరణకు చర్యలు

మొదటిపేజీ తరువాయి..

జరిగింది. ఈ సమావేశంలో మంత్రుల కమిటీ సభ్యులు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ, పప్పులు, బియ్యం, వంట నూనెలు, టమోటా, ఉల్లిపాయల వంటి నిత్యావసర వస్తువుల డిమాండ్, రిటైల్ హోల్‌సేల్ మార్కెట్ ధరల పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న యుద్ధ వాతావరణ ప్రభావంతో కొంతమేర ధరలు పెరిగినా, వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వం పూర్తి స్థాయిలో సన్నద్ధంగా ఉందన్నారు. ముఖ్యంగా దేశవ్యాప్తంగా వంటనూనెల ధరలు పెరిగిన నేపథ్యంలో రాష్ట్రంలో ప్రజలకు అందుబాటు ధరల్లో లభించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాబోయే ఖరీఫ్ సీజన్ దృష్ట్యా వ్యవసాయ , పౌర సరఫరాల శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నాయని మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, మనోహర్ తెలిపారు.

రైతులు ప్రాధాన్యత కలిగిన వరి వంగడాలను సాగు చేసేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. డిమాండ్ తక్కువ ఉన్న వరి రకాల సాగు వల్ల ధాన్యం కొనుగోళ్ల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

ముఖ్యంగా 1010, పీఆర్-126 వంటి రకాలలో అధిక శాతం నూక వస్తుండటంతో వినియోగానికి అనుకూలంగా లేకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని వివరించారు. ఈ అంశంపై క్షేత్రస్థాయిలో రైతులకు పూర్తి అవగాహన కల్పించేలా యంత్రాంగానికి సూచనలు ఇచ్చినట్లు తెలిపారు. వచ్చే మూడు నెలల్లో ధరలను అదుపులో ఉంచేందుకు అవసరమైన ముందస్తు చర్యలపై అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చామని, మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని మంత్రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్స్-అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, పౌర సరఫరాల కమిషనర్ కె. కన్నా బాబు, పౌరసరఫరాల కార్పొరేషన్ ఎండీ ఎస్. ఢిల్లీ రావు, ఆయిల్ ఫెడ్ ఎండీ బాలాజీ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల అడ్డుకట్టకు ఏపీ సైబర్ గార్డ్

### డిజిటల్ అరెస్టులని ఫోన్ చేసేవాళ్లు అరెస్టవ్వాలి : సీఎం

మొదటిపేజీ తరువాయి..


సైబర్ నేరాలను అరికట్టేందుకు సిక్స్ పిల్లర్ వ్యవస్థలతో ఏపీ సైబర్ గార్డ్ అనే సమగ్ర సైబర్ భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. 6 పిల్లర్ సైబర్ భద్రతా వ్యవస్థలో సైబర్ వార్ రూం, 1930 కాల్ సెంటర్ డాష్ బోర్డ్, టెక్నాలజీఏఐ, కెపాసిటీ బిల్డింగ్, 3-టైర్ ఆర్కిటెక్చర్, ప్రజా చైతన్యం వంటి కార్యక్రమాలు చేపడతాం. 6 పిల్లర్స్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్థాయిలో ఒక సైబర్ వార్ రూంను ఏర్పాటు చేస్తున్నాం. దీని కోసం మంగళగిరిలోని 'ప్రభల టెక్ పార్క్?ఇలో ఇప్పటికే భవనాన్ని ఎంపిక చేశాం.

ఈ సైబర్ వార్ రూంలో ఎమర్జెన్సీ రెస్పాన్స్, సైబర్ థ్రెట్ ఇంటలిజెన్స్ అండ్ ఎనలటిక్స్, సైబర్ సెక్యూరిటీ ఆపరేషన్స్, సైబర్ ట్రైనింగ్ అండ్ అవేర్నెస్ రీసెర్చ్, లీగల్, పాలసీ అండ్ కంప్లైంట్స్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేషన్ వంటి మొత్తం 11 విభాగాలు పనిచేస్తాయి. రానున్న 30 రోజుల్లో ఆధునిక సదుపాయాలతో ఈ వార్ రూం అందుబాటులోకి వస్తుంది. ఇప్పటికే అందుబాటులో ఉన్న 1930 హెల్ప్ లైన్ కాల్ సెంటర్‌ను మరింత బలోపేతం చేస్తాం. జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ (చ్ఛైత్రా), 1930 హెల్ప్‌లైన్‌తో సమగ్ర డ్యాష్‌బోర్డ్ తీసుకువస్తున్నాం. ఫిర్యాదు వచ్చిన 10 నిమిషాల్లో బ్యాంకును సంప్రదించి నిందితుని అకౌంట్లో డబ్బులు ఫ్రీజ్ చేసేలా వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం.

సైబర్ నేరాలపై టెక్నాలజీ & ఏఐ ఉపయోగించుకునేందుకు ఆర్బీఐ, ప్రముఖ బ్యాంకులతో కలిసి MuleHunter.AI అమలు దిశగా చర్యలు తీసుకువస్తున్నాం. కెపాసిటీ బిల్డింగ్‌లో భాగంగా ఏడాది కాలంలో 500 మంది పోలీసు అధికారులకు సైబర్ క్రైంపై ట్రైనింగ్ ఇస్తాం. 3 టైర్ ఆర్కిటెక్చర్ ద్వారా 28 జిల్లాల్లో సైబర్ యూనిట్లతో పాటు 4 చోట్ల రీజనల్ హబ్‌లను ఏర్పాటు చేస్తాం. వీటితో పాటు ప్రజలు సైబర్ క్రైం బారిన పడకుండా పెద్దఎత్తున ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఏడాదిలో 3 వేల కార్యక్రమాలు వివిధ స్థాయిల్లో, వివిధ రూపాల్లో చేపడతాం.

ఏపీ సీఐడీ, ఏపీటీఎస్ బృందం న్యూఢిల్లీలోని ఇండియన్ సైబర్ క్రైం కో ఆర్డినేషన్ సెంటర్‌ను సందర్శించి అక్కడి వ్యవస్థలను అధ్యయనం చేసింది. అక్కడ అవలంభిస్తున్న పాలసీల ఆధారంగా రాష్ట్ర రూపకల్పన చేపడుతున్నాం. టాప్ బ్యాంక్‌ల నోడల్ అధికారుల నియామకం, 30 నిమిషాల ఎస్-ఎల్ఏ కోసం బ్యాంకులతో ఒప్పందాలు చేసుకుంటాం. సీసీఎస్ పోలీస్ స్టేషన్లను ప్రత్యేక దర్యాప్తు యూనిట్లుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాము. ఈ విధంగా అన్ని చర్యలను తీసుకుని సైబర్ మోసాలకు, నేరాలకు అడ్డుకట్ట వేస్తాం" అని ముఖ్యమంత్రికి డీజీపీ వివరించారు.

అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడుతూ...."రాష్ట్రాన్ని సైబర్ నేరాల రహిత రాష్ట్రంగా మార్చాలి. దీని కోసం అన్ని బ్యాంకర్లు, పోలీసు విభాగం, ఏపీటీఎస్, ఆర్థిక శాఖలు సమన్వయంతో పనిచేయాలి. నేరస్తులు కొత్త కొత్త పద్ధతుల్లో



నేరాలకు పాల్పడుతున్నందున దానికి అనుగుణంగా పోలీసుల కౌంటర్ ప్లాన్ ఉండాలి. ముఖ్యంగా డిజిటల్ అరెస్టు విషయంలో విద్యావంతులు సైతం మోసపోతున్నారని... డిజిటల్ అరెస్టు లేదనే విషయాన్ని ప్రజల్లో నాటుకుపోయేలా చేయాలి. డిజిటల్ అరెస్టులని ఫోన్ చేసేవాళ్లు అరెస్టై తీరాలి. ఆ తరహాలో కఠిన చర్యలు ఉండాలి.

ఏళ్ల తరబడి కష్టపడి ప్రజలు దాచుకున్న సొమ్ములను సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టుల పేరుతో దోచుకుంటున్నారు. దీని వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తోంది. ఏపీ సైబర్ నేరాల నియంత్రణకు తీసుకునే చర్యలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలి. సైబర్ నేరగాళ్ల పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాలి. ఏపీ ప్రజలను మోసం చేస్తే....తప్పించుకోలేం అనే హెచ్చరిక క్రిమినల్స్‌కు చేరాలి.

ఆ స్థాయిలో భయం కల్పించేలా పోలీసు దర్యాప్తు, యాక్షన్ ఉండాలి" అని సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయంలో జరిగిన సమీక్షకు సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్, ఈగల్ చీఫ్ ఆకే రవికృష్ణ, స్పెషల్ సెక్రటరీ విజయ్ కుమార్ పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు

- 2,898 హాస్టళ్లు, స్కూళ్లలో నెట్ జీరో విధానంలో సోలారైజేషన్
- నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పీఎం సూర్యఘర్ అమలు
- 18 గిగావాట్లను ప్రధాన గ్రిడ్‌కు కనెక్ట్
- సుమారు రూ.22 వేలకోట్లతో ప్రతిపాదనలు
- విద్యుత్ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి,మే29(ప్రజా ప్రతిభ):** రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఏర్పాటు చేసి.. ఆ మేరకు విద్యుత్ నెట్ వర్క్‌ను మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు గ్రీన్ ఎనర్జీ కారిడార్-3లో భాగంగా సుమారు రూ. 22 వేల కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ శాఖపై సమీక్షించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ అంశం సహా విద్యుత్ సరఫరా పరిస్థితి, వచ్చే ఆరు నెలల ప్రణాళిక, పీఎం సూర్య ఘర్, పీఎం కుసుమ్, పీఎంఈ-డ్రైవ్ పథకాల పురోగతి, ఏపీఐఈపీ పాలసీ కింద ఆమోదించిన వివిధ ప్రాజెక్టుల పరిస్థితి, నెడ్‌క్యాప్ బలోపేతం, డిజిటల్ ట్విన్ గ్రిడ్ నిర్మాణం వంటి అంశాలపై చర్చించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్‌లో భాగంగా ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్ విస్తరించే అంశంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని సీఎం చంద్రబాబు అధికారులను అడిగారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్-3 కింద సుమారు 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు చర్యలు తీసుకుంటున్నా మని వివరించారు. ఈ మేరకు కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్లు, పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్టు వెల్లడించారు. మొత్తంగా 18 గిగావాట్లల్లో సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే 11 గిగా వాట్ల విద్యుత్ ను అలాగే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే సుమారు 7 గిగావాట్ల విద్యుత్ ను ప్రధాన గ్రిడ్ కు అనుసంధానించేలా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు వివరించారు. ఈ మేరకు 2,261 కిలో మీటర్ల మేర కొత్త ట్రాన్స్ మిషన్ లైన్లు వేయనున్నట్టు వెల్లడించారు. ఈ కారిడార్లో భాగంగా 9,500 మెగా వాట్ల సామర్ధ్యంతో 5 భారీ పూలింగ్ స్టేషన్లను నిర్మించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు అధికారులు వెల్లడించారు. ముదిగుబ్బ, తలుపుల, రామాయపట్నం, పోరుమామిళ్ల, కొప్పాక ప్రాంతాల్లో పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్టు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీలో 160 గిగా వాట్ల ఉత్పత్తికి లక్ష్యం నిర్దేశిరచుకున్నామని.. దానికి అనుగుణంగా నెట్ వర్క్‌ను కూడా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఏపీ గ్రీన్ ఎనర్జీ కారిడార్ పూర్తి అయితే.. రాష్ట్రంలో డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్ ను సరఫరా చేసేందుకు ఈ నెట్ వర్క్ బాగా ఉపకరిస్తుందని అభిప్రాయపడ్డారు.

ఇక విద్యుత్ మౌలిక సదుపాయాలు పెరిగితే.. ఆయా రంగాల్లో పెట్టుబడులు కూడా పెద్ద ఎత్తున వస్తాయని సూచించారు.

## హర్మూజ్ దాటిన మరో భారత నౌక

మొదటిపేజీ తరువాయి..

సంకేతాలు కనిపిస్తున్నాయి.

ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి గత కొన్ని నెలలుగా ఉద్రిక్త పరిస్థితులకు కేంద్రబిందువైంది. ప్రాంతీయ ఘర్షణలు, నౌకలపై దాడుల భయంతో ఫిబ్రవరి నుంచి సముద్ర రాకపోకలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో దాదాపు 2,000 నౌకలు నిలిచిపోయిన పరిస్థితి ఏర్పడింది.ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే చమురు, సహజ వాయువులో ఐదో వంతు ఈ మార్గం ద్వారానే రవాణా అవుతుండటంతో అంతర్జాతీయ మార్కెట్లపై కూడా తీవ్ర ప్రభావం పడింది. ముఖ్యంగా అవసరాల్లో 85 శాతానికి పైగా చమురును దిగుమతి చేసుకునే భారత్‌కు ఈ సంక్షోభం పెద్ద సవాలుగా మారింది.

అయితే ఇటీవల 'సర్వ శక్తి' సహా మరికొన్ని భారత ట్యాంకర్లు విజయవంతంగా హర్మూజ్ మార్గాన్ని దాటడం పరిస్థితులు క్రమంగా సాధారణ స్థితికి చేరుతున్నాయనే ఆశలు రేకెత్తిస్తోంది. తాజా పరిణామంతో దేశీయ ఇంధన నిల్వలకు, ముఖ్యంగా వేసవి కాలంలో గృహ వినియోగానికి అవసరమైన ఎల్పీజీ సరఫరాకు ఊరట లభించనుంది. ఇక వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య చర్చలు పురోగతిలో ఉన్నాయని, మరో 60 రోజుల కాల్పుల విరమణ పొడిగింపుపై ఇరు దేశాలు సానుకూలంగా ఉన్నట్లు అంతర్జాతీయ వర్గాలు పేర్కొంటు న్నాయి. హర్మూజ్ మార్గం పూర్తిగా తెరుచుకుంటే ప్రపంచ చమురు ధరలు స్థిరపడే అవకాశముందని అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ అభిప్రాయపడ్డారు.

## నీట్ పేపర్ లీక్ బాధ్యత ఎవరిది..?

మొదటిపేజీ తరువాయి..


పేపర్ లీక్ విషయంలో లోపాలకు జవాబుదారీతనం ఉండాల్సిందేనని, అప్పటి వరకు అసలు సమస్య ఆగదని వ్యాఖ్యానించింది.

అయితే, యువత ఆందోళనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుంటోందని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం ధర్మాసనానికి వెల్లడించారు. పరిస్థితిని ప్రధానమంత్రి కూడా వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. జూన్ 21న మరోసారి నిర్వహించే నీట్-యూజీ పరీక్ష కోసం కొత్త యంత్రాంగాలను ఏర్పాటు చేశామన్నారు. అయితే, ఈ వ్యవహారంపై ప్రతిస్పందన తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం ధర్మాసనం.. తదుపరి విచారణను జులై రెండో వారానికి వాయిదా వేసింది. నీట్ పేపర్ లీక్ ఉదంతంపై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీపై(ఎన్‌టీఏ) పలు ప్రశ్నలు సంధించింది. ఇన్ని నిఘా వ్యవస్థలు, కమిటీలు ఉన్నా పేపర్ ఎలా లీకైందని ప్రశ్నించింది. యూపీఎస్సీలో ఇలాంటి ఉదంతాలు ఎప్పుడూ వెలుగుచూడలేదని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. యూపీఎస్సీని చూసి నేర్చుకోవాలని ఎన్‌టీఏకు సూచించింది. నీట్ వ్యవస్థ ప్రక్షాళనకు కేంద్రం ఏర్పాటు చేసిన హైలెవెల్ కమిటీ చైర్మన్, ఇస్రో మాజీ చీఫ్ డా. రాధాకృష్ణన్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్‌టీఏ, డా. రాధాకృష్ణన్ దాఖలు చేసిన అఫిడవిట్‌లను సర్వోన్నత న్యాయస్థానం పరిశీలించింది. కేంద్రం తన ఎఫిడవిట్ దాఖలు చేసేందుకు న్యాయస్థానం అదనపు గడువు ఇచ్చింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి జస్టిస్ నరసింహ మాట్లాడుతూ పేపర్ లీక్‌కు ఆస్కారం కల్పించిన పరిస్థితులు ఏమిటని డా. రాధాకృష్ణన్‌ను కోర్టు ప్రశ్నించారు. గతంలో అనేక రక్షణలను ఏర్పాటు చేసినా పేపర్ లీక్ ఎలా అయ్యిందని అన్నారు. ఇందుకు డా. రాధాకృష్ణన్ బదులిస్తూ పేపర్ సెట్టింగ్ ప్రక్రియలో సమస్య ఉందని అన్నారు. ప్రస్తుతం ఆ లోపాలను సరిదిద్ది వ్యవస్థను మరింత బలోపేతం చేశామని అన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి సమస్య తలెత్తకుండా గతంలో మొత్తం 101 సూచనలు చేశామని చెప్పారు. వాటిల్లో 60 తాత్కాలిక సూచనలను 2025-26 పరీక్ష కోసం ప్రత్యేకంగా రూపొందించినట్లు చెప్పారు. ఇతర మార్గదర్శకాలు కూడా త్వరలో పూర్తిస్థాయిలో అమలవుతాయని చెప్పారు. మరోసారి ఇలాంటివి జరగవని ధీమా వ్యక్తం చేశారు. సంస్కరణలే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం సంస్కరణలతో పరిస్థితి చక్కబడదని కోర్టు వ్యాఖ్యానించింది. తప్పు జరిగినప్పుడు బాధ్యత ఎవరిదనే దానిపై స్పష్టత ఉండాలని పేర్కొంది. బాధ్యత ఎవరు తీసుకుంటారనేది తేల్చకుండా ఎన్ని కమిటీలు, మీటింగ్‌లు ఏర్పాటు చేసిన ఫలితం ఉండదని వ్యాఖ్యానించింది. ఇక ఈ అంశంపై సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ పేపర్ లీక్‌పై విచారణ జరుగుతోందని అన్నారు. జూన్ 21 నాటి పరీక్ష నిర్వహణ కోసం కొత్త వ్యవస్థలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. ప్రధాని స్వయంగా ఈ అంశాన్ని పర్యవేక్షిస్తున్నారని కోర్టుకు తెలిపారు.

## 33 శాతం రిజర్వేషన్లు చారిత్రక నిర్ణయం

### టిడిపి సంస్కరణలకు ఎప్పుడూ ముందుంటుంది


### హోంమంత్రి వంగలపూడి అనిత



**అమరావతి,మే29(ప్రజా ప్రతిభ):** చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ధైర్యంగా ప్రకటించిన పార్టీ తెదేపా అని మంత్రి వంగలపూడి అనిత అన్నారు. రిజర్వేషన్లపై చట్టం అమల్లోకి రాకపోయినా పార్టీ నిర్ణయం తీసుకుందని చెప్పారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో అనిత మాట్లాడారు. ఎన్టీఆర్ హయాంలో మహిళలకు ఆత్మగౌరవం చంద్రబాబు హయాంలో వారి ఆర్థిక గౌరవం పెరిగాయి. కోటి మంది మహిళలతో డ్వాక్రా సంఘాలు విరాజిల్లుతున్నాయి. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అంశం 33 ఏళ్లుగా నానుతోంది. మహానాడును మహిళలకు అంకితం చేస్తున్నట్లుగా స్త్రీశక్తి థీమ్‌తో నిర్వహించారు. మహిళా రిజర్వేషన్లపై చట్టం అమల్లోకి రాకపోయినా పార్టీ నిర్ణయం తీసుకుందని అనిత అన్నారు. పార్లమెంటు చట్టంతో సంబంధం లేకుండా మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నది తమ పార్టీ నిర్ణయమని స్పష్టం చేశారు. లోకేశ్ చేసిన ఈ ప్రతిపాదనపై పార్టీలో మరింత చర్చ చేసి 2029 ఎన్నికలనాటికి తప్పకుండా అమల్లోకి తెస్తామన్నారు. దీనికి అనుగుణంగా నియోజకవర్గాల్లో ఇప్పటి నుంచే మహిళా నాయకత్వాన్ని తయారు చేస్తామని తెలిపారు. 33 శాతం మహిళా రిజర్వేషన్లపై ఇతర పార్టీల నిర్ణయాలపై తాము మాట్లాడమని తెలిపారు.

# సడన్ డైట్‌లు.. శరీరానికి స్లో పాయిజన్..!

- వేగంగా బరువు తగ్గితే.. శరీరానికే ముప్పు
- కిలోలు తగ్గినా.. ఆరోగ్యం క్షీణించే ప్రమాదం
- కొవ్వు కాదు.. కండరాలే కరిగిపోతాయని వైద్యుల హెచ్చరిక
- స్లో అండ్ స్టెడీ వెయిట్ లాస్‌నే బెస్ట్ అంటున్న నిపుణులు









ఈ రోజుల్లో ఊబకాయం సమస్య చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి ఇంట్లో కనిపిస్తోంది. ఫిట్‌గా కనిపించాలని, త్వరగా స్లిమ్ అవ్వాలని చాలా మంది కఠినమైన డైట్‌లకు అలవాటు పడుతున్నారు. సోషల్ మీడియాలో కనిపించే "10 రోజుల్లో 10 కిలోలు తగ్గండి"లాంటి ప్రకటనలు చూసి ఆకర్షితులవుతున్నారు. కానీ ఇలా ఒక్కసారిగా బరువు తగ్గడం శరీరానికి తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### - కొవ్వు కాదు.. కండరాలే కరిగిపోతాయి

ఒక్కసారిగా ఆహారం తగ్గించడంతో శరీరం దాన్ని "ఆకలి పరిస్థితి"గా భావిస్తుంది. ఈ సమయంలో శరీరం కొవ్వును భద్రపరచి, శక్తి కోసం కండరాలను కరిగించడం ప్రారంభిస్తుంది. దీంతో శరీర బలం తగ్గిపోవడంతో పాటు అలసట, నీరసం, బలహీనత వంటి సమస్యలు తలెత్తుతాయి.

కండరాలు మన శరీరంలో క్యాలరీలను నిరంతరం ఖర్చు చేసే ఇంజన్‌లా పనిచేస్తాయి. అవే తగ్గిపోతే జీవక్రియ (మెటబాలిజం) రేటు కూడా పడిపోతుంది. ఫలితంగా శరీరం క్యాలరీలను కరిగించే సామర్థ్యం కోల్పోతుంది.

### - డైట్ ఆపేస్తే.. మరింత వేగంగా బరువు పెరుగుదల

కఠినమైన డైట్‌ను కొన్ని రోజులు పాటించిన తర్వాత మళ్లీ సాధారణ ఆహారం తీసుకోవడం ప్రారంభిస్తే పరిస్థితి మరింత దారుణంగా మారుతుంది. ఇప్పటికే మెటబాలిజం బలహీనపడిపోవడంతో తిన్న ఆహారం సరిగా కరగదు. దీంతో కొవ్వు వేగంగా పేరుకుపోయి మునుపటి కంటే ఎక్కువ బరువు పెరిగే ప్రమాదం ఉంటుంది. దీనినే వైద్యులు "యో-యో ఎఫెక్ట్"గా పేర్కొంటున్నారు.

### సురక్షితంగా బరువు తగ్గాలంటే..

ఒక్కసారిగా కాకుండా రోజుకు 300--500 క్యాలరీలు మాత్రమే తగ్గించాలి
ప్రతి భోజనంలో ప్రొటీన్ ఉండేలా చూసుకోవాలి
వారానికి కనీసం మూడు సార్లు వ్యాయామం చేయాలి
ముఖ్యంగా బరువులు ఎత్తే వ్యాయామాలు కండరాలను కాపాడతాయి
కేవలం వెయిట్ మెషీన్‌పై సంఖ్యలకే కాకుండా శరీర ఉత్సాహం, ఫిట్‌నెస్‌పైనా దృష్టి పెట్టాలి

### "త్వరగా తగ్గడం కాదు.. ఆరోగ్యంగా తగ్గడమే ముఖ్యం"

వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. నెలకు 2 నుంచి 4 కిలోల వరకు క్రమంగా తగ్గే బరువే శరీరానికి సురక్షితం. ఆహార నియంత్రణతో పాటు సరైన వ్యాయామం, తగిన నిద్ర, మానసిక ప్రశాంతత కూడా బరువు నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయి.

"సడన్ డైట్‌లు కాదు.. స్మార్ట్ లైఫ్‌స్టైల్‌నే ఆరోగ్యానికి అసలైన పరిష్కారం"

## ఆదివాసుల సాంప్రదాయాల హక్కులపై బీజేపీ కేంద్ర ప్రభుత్వం

చేస్తున్న తీవ్ర మైన దాడినీ ఖండించండి.
ఆదివాసీలకు మతం ప్రాతిపదిన రిజర్వేషన్ వ్యతిరేకించండి.
చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీ అమలులో చిత్తశుద్ధి లేదు
ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ వైస్ చైర్మన్ మాజీ ఎంపీ మీడియం బాబూరావు.







**అరకులోయ, మే 29:**

అరకు వేలిలో నిర్వహించిన ఈ విలేకరుల సమావేశంలో ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ వైస్ చైర్మన్, మాజీ ఎంపీ మీడియం బాబురావు మాట్లాడుతూ "మన దేశంలో గిరిజన తెగలు అనాది కాలం నుంచి నివసిస్తున్నాయి. ఈ తెగలు తమ స్వంత ఆలోచనలు, సాంప్రదాయాలు, మత విశ్వాసాలతో ముఖ్యంగా ప్రకృతి ఆరాధకులుగా జీవిస్తున్నారు. 1961 సెన్సస్ తర్వాత వచ్చిన అన్ని జనాభా గణనలలోనూ వీరిని హిందువులుగా బలవంతంగా నమోదు చేయడం పూర్తిగా సరికాదని అందువల్ల రాబోయే 2027సెన్సెస్ లో ఆదివాసులందరినీ ఎస్టీ (షెడ్యూల్డ్ ట్రైబ్ ) కాలమ్‌లోనే నమోదు చేయాలని మేము డిమాండ్ చేస్తున్నామని హిందూ లేదా ఇతరులు కాలమ్‌లో వారిని చేర్చడాన్ని మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇటీవల చేసిన వాక్యాలు "ఆదివాసులు చర్చికి లేదా మసీదుకు వెళ్తే ఎస్టీ హోదా కోల్పోతారు" అనే వ్యాఖ్యలను మీడియం బాబురావు తీవ్రంగా ఖండించారు. "ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం మరియు అమానుషం. ఎస్టీ రిజర్వేషన్ మతం ఆధారంగా ఇవ్వబడలేదు. ఇది తెగమరియు 5వ షెడ్యూల్, 6వ షెడ్యూల్ ప్రాంతాల ఆధారంగా రాజ్యాంగం ఇచ్చిన హక్కు. రాజ్యాంగం ఆర్టికల్ 25 ప్రకారం ప్రతి పౌరుడికి మత స్వేచ్ఛ ఉంది. దాన్ని రిజర్వేషన్‌తో ముడిపెట్టడం పూర్తిగా తప్పు అన్నారు. అంతేకాకుండా ఆదివాసులను భయభ్రాంతులకు గురి చేయడమే ఆదివాసుల ప్రత్యేక సంస్కృతి సాంప్రదాయాలను గుర్తించే ఆర్టికల్ 342 ను కూడా సవరిస్తామని చెప్పడం అన్యాయమని భారత రాజ్యాంగాన్ని దిక్కరించి మను ధర్మాన్ని అమలు చేయాలనీ కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించినాదాని ఆరోపించారు. ఆదివాసీ తెగల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడానికి కుట్ర చేస్తుంది దాని అన్నారు. అరకు ఎన్నికల సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుఇచ్చిన జీవో నెం.-3 పునరుద్ధరణ హామీని రెండున్నర సంవత్సరాలు గడిచినా అమలు చేయకపోవడాన్ని తీవ్రంగా ఆరోపణలు చేశారు. ఈ జీవో వల్ల గత 20 ఏళ్లుగా మండల పరిషత్ స్కూళ్లు, ఐటీడీఏ పాఠశాలల్లో 100 % ఉద్యోగాలు స్థానిక ఆదివాసి గిరిజనులకే వచ్చేవి. దీన్ని రద్దు చేసి 6.5%కి తగ్గించడం అన్యాయం. 2026లో జరగబోయే మెగా డీఎస్సీ కి ముందు 100% స్థానిక రిజర్వేషన్ అమలు చేసే ఉత్తర్వులు జారీ చేయాలి" అని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి,గవర్నర్‌కు ఉన్న విచక్షణాధికారం ఉపయోగించి ఆర్డినెన్స్ ద్వారా ఈ జీవోను పునరుద్ధరించాలని కోరారు. చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధి నీ సంకించవలసి వచ్చిందని, మహానాడు లో కనీసం ఆదివాసీ సమస్యలపై ప్రకటన లేదని అన్నారు. భూమి మరియు అటవీ హక్కుల సమస్య రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 6 హైడ్రో పవర్ ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చి సుమారు20 వేల ఎకరాల గిరిజనుల అటవీ భూమిని లాక్కోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. "కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గిరిజనులకు ఈ రెండూళ్ళు లో అటవీ భూమి పోడు పట్టాలు కేవలం 16 మాత్రమే ఇచ్చింది. అదే సమయంలో కార్పొరేట్ కంపెనీలకు వేలాది ఎకరాలు ధారాదత్తం చేస్తోంది. గ్రామసభలను, పెసా చట్టం, 1/70చట్టం నిబంధనలను దిక్కరించి గిరిజన సలహా మండలి ఆమోదాన్ని లేకుండా రాజ్యాంగాన్ని అతిక్రమిస్తోంది. ఇది చాలా అన్యాయం" అని ఆరోపించారు. జీవోలు 13, 51, 2 ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు పి. అప్పలనర్స్ జాతీయ కార్యవర్గ సభ్యులు కిల్లో సురేంద్ర ఆదివాసీ గిరిజన సంఘం,రాష్ట్ర ప్రధాన కార్యదర్శిపొద్దు బాలదేవ్ ఆదివాసీ గిరిజన సంఘం,జిల్లా ప్రధాన కార్యదర్శిజి. బుజ్జిబాబు, ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి రామారావు పాల్గొన్నారు.

## హైడ్రో పవర్ ప్రాజెక్ట్ ప్రభావిత ప్రాంతమైన

### మజ్జివలస గ్రామంలో అఖిల భారత గిరిజన సంఘం ఉద్యోగుల బృందం పర్యటన

**అరకులోయ, మే 29( ప్రజా ప్రతిభ):ం**



అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం బూర్జ పంచాయితీ మజ్జి వలస గ్రామంలో శుక్రవారం అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వారు మాసాడా ఈశ్వరరావు మరియు ఉద్యోగుల బృందా పర్యటించడం జరిగింది. మజ్జివలస హైడ్రో పవర్ ప్రాజెక్ట్ కోసం ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న గిరిజనులను మద్దతు ఇవ్వడం కోసం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బూర్జ పంచాయతీ కన్వీనర్ మజ్జి సురేష్ కుమార్ కో కన్వీనర్ మజ్జి కృష్ణంరాజు మరియు కమిటీ సభ్యులు పాల్గొనారు. మరియు మజ్జివలస ప్రాంత ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అరకులోయ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో

### ఆంధ్ర బెటాలియన్ ఎన్ సి సి ప్రత్యేక అవగాహన సదస్సు.





**అరకులోయ, మే 29: ( ప్రజా ప్రతిభ):**

అల్లూరి సీతారామరాజు జిల్లా యంత్రాంగం, 13 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి సంయుక్త ఆధ్వర్యంలో అరకు వేలి లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సు (ఇంటరక్టివ్ సెషన్ ) ఎంతో స్ఫూర్తిదాయకంగా, విజయవంతంగా ముగిసింది.

ప్రస్తుతం ఏజెన్సీ ప్రాంతంలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్‌కు హాజరైన ఎన్‌సిసి కేడెట్లు, స్థానిక గిరిజన యువత ఈ కార్యక్రమంలో అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి ద్వారా లభించే ప్రయోజనాలు, ఉన్నత విద్యా-ఉపాధి రంగాలలో లభించే వివిధ అవకాశాలపై యువతకు విస్తృత అవగాహన కల్పించారు. అనంతరం కేడెట్లు, గిరిజన యువత తమ ఆలోచనలను, వ్యక్తిగత అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ?ఈ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక సమ్మేళనం యువతలో ఐక్యతను, పరస్పర అవగాహనను మరింత పెంపొందించింది. ఏజెన్సీ ప్రాంత గిరిజన యువతకు భాషా పరమైన ఇబ్బందులు లేకుండా, భావ వ్యక్తీకరణ సాఫీగా సాగేందుకు వీలుగా అధికారికంగా ఒక అనువాదకుడిని (ట్రాన్సలేటర్ ) కూడా నియమించారు. ఎంతో అర్ధవంతంగా, ఉత్పాదకతతో సాగిన ఈ సదస్సు ఏజెన్సీ యువతలో సరికొత్త స్ఫూర్తిని నింపిందని జిల్లా అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం లో డిటిడబ్ల్యు పరిమళ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి చలపతి రావు ఓ ఎస్ డి గురుకులం స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్ మూర్తి ఎన్ సి సి ట్రైనింగ్ అధికారులు సమ్మర్ యూత్ క్యాంపు విద్యార్థులుఎన్ సి సి క్యాడెట్స్ తదితరులు పాల్గొన్నారు.

## గూడెం కొత్త వీధిలో భారీ ఎత్తున గంజాయి పట్టివేత

### నలుగురు గంజాయి స్మగ్లర్ల అరెస్టు

### పట్టుకున్న గంజాయి విలువ కోటి పైనే



**అల్లూరి జిల్లా గూడెం కొత్త వీధి మే 29 ప్రజా ప్రతిభ**

అల్లూరి జిల్లా గూడెం కొత్త వీధి మండలం మీదుగా అక్రమంగా రవాణా చేస్తున్న భారీ ఎత్తున గంజాయిని గూడెం కొత్త వీధి పోలీసులు పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతాల నుండి ఒక గంజాయి ముఠా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నది అన్న సమాచారం మేరకు గూడెం కొత్త వీధి ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందం గూడెం కొత్త వీధి మండలంలోని పాత వీధి జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతం నుండి వస్తున్న ఒక వాహనం లో తనిఖీలు నిర్వహించగా సుమారు 170 కేజీల గంజాయి పట్టుబడింది గూడెం కొత్త వీధి ఎస్సై సురేష్ గంజాయి నిందితులను పట్టుకుని అరెస్టు చేశారు అరెస్టు చేసిన వారిలో చిత్తూరు ప్రాంతానికి చెందిన దామోదరం రాజానగరం ప్రాంతానికి చెందిన సత్యనారాయణ వెంకటేశ్వరరావు గూడెం కొత్త వీధి మండలానికి చెందిన మార్క్రప సిద్దు ఉన్నారు వీరిని అరెస్టు చేసి గూడెం కొత్త వీధి సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో చింతపల్లి కోర్టులో హాజరు పరిచారు దర్యాప్తులో భాగంగా ఒక కారు ఒక బైకు 170 కేజీల గంజాయిని మధ్యవర్తుల సమక్షంలో సీజ్ చేయడం జరిగింది . కాగా ఎవరైనా అక్రమంగా గంజాయి రవాణా చేయాలని ప్రయత్నిస్తే అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని గూడెం కొత్త వీధి పోలీసులు తెలిపారు.

## పెద్దనాపల్లి -చిన్నింపేట బీటీ రోడ్డు పనులు పరిశీలించిన ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

**ప్రత్తిపాడు/తుని, మే 29 (ప్రజా ప్రతిభ) :**



ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా చొరవతో పెద్దనాపల్లి నుండి చిన్నింపేట వరకు చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి.ఈ నిర్మాణ పనులను కాకినాడ జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు,ఏలేశ్వరం మండల ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి స్వయంగా పరిశీలించారు.రోడ్డు పనుల నాణ్యత,నిర్మాణ వేగం,ప్రజలకు కలిగే ప్రయోజనాలపై ఆర్‌డబీ అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యాలు మెరుగుపడటంతో ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్‌డబీ అధికారులు,నాయకులు సుంకర సత్య నారాయణ,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంక్ పనుల్లో నిర్లక్ష్యం
## నాసిరకం నిర్మాణంపై గ్రామస్తుల ఆందోళన





యర్రగొండపాలెం ఆర్ సి ఇంచార్జ్/ డి ప్రసాద్ రెడ్డి, మే 29,(ప్రజా ప్రతిభ).

పెద్ద దోర్నాల గ్రామంలో నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్ పనులు వివాదాస్పదంగా మారాయి. ట్యాంక్ నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పనుల్లో "క్వాలిటీ ఆఫ్ వర్క్" పూర్తిగా గాలికొదిలేశారని ఆరోపిస్తున్నారు.గ్రామస్తుల కథనం ప్రకారం.. కాంక్రీటు పనులు పూర్తయ్యాక తప్పనిసరిగా చేయాల్సిన క్యూరింగ్ సరిగా నిర్వహించడం లేదని తెలుస్తోంది. దీంతో నిర్మాణ భాగాల్లో చీలికలు, బలహీనతలు కనిపిస్తున్నాయని వారు చెబుతున్నారు. అంతేకాకుండా ఇసుక, సిమెంట్ మిశ్రమం కూడా ప్రమాణాలకు అనుగుణంగా లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ విషయంపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. భవిష్యత్తులో ట్యాంక్ ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని భయం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి పనులను పరిశీలించి, నాణ్యతతో పూర్తి చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.గ్రామంలో తాగునీటి అవసరాల కోసం నిర్మిస్తున్న ట్యాంక్ పనుల్లో నిర్లక్ష్యం చోటుచేసుకోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రజల ఆందోళనకు ముగింపు పలకాలని కోరుతున్నారు.

## ప్రభుత్వ సేవల
## నాణ్యత పెంపుకు ఐవిఆర్ఎస్ కీలకం
### ఎంపీడీవో జాన్ సుందరం.



యర్రగొండపాలెం ఆర్ సి ఇంచార్జ్/ డి ప్రసాద్ రెడ్డి, మే 29,(ప్రజా ప్రతిభ).

మార్కాపురం జిల్లా పెద్దారవీడు మండలం ఎంపీడీవో కార్యాలయంలో పెన్షన్‌లకు సంబంధించి లబ్ధిదారులకు వస్తున్న ఐవీఆర్ఎస్ కాల్స్‌పై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని ఎంపీడీవో జాన్ సుందరం స్వర్ణ గ్రామ సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, సమర్థత పెంచేందుకు ఐవీఆర్ఎస్ కాల్స్ కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు.ప్రజలు ఫోన్ కాల్స్‌కు సరైన సమాధానాలు ఇవ్వడం ద్వారా పెన్షన్‌ల పంపిణీ, సేవల అమలుపై ప్రభుత్వానికి స్పష్టమైన సమాచారం అందుతుందని పేర్కొన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ప్రతి లబ్ధిదారునికి ఐవీఆర్ఎస్ కాల్స్ ప్రాముఖ్యతను వివరించి, కాల్స్ వచ్చినప్పుడు సానుకూలంగా స్పందించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు.అలాగే తప్పుడు సమాచారం ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సేవలపై ప్రజల అభిప్రాయాలు నిజాయితీగా నమోదు కావడం వల్ల సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవోలు శ్రీనివాస్, కట్టా రాణి, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో
## ఇళ్ల రేకులు ఎగిరిపోయిన ఘటన.
### బాధితులను పరామర్శించిన ఎస్సీ కమిషన్ సభ్యుడు డాక్టర్ గౌతమ్ రాజు.


యర్రగొండపాలెం ఆర్ సి ఇంచార్జ్/ డి ప్రసాద్ రెడ్డి, మే 29,(ప్రజా ప్రతిభ).

మార్కాపురం జిల్లా త్రిపురాంతకం మండలం పాత అన్న సముద్రం గ్రామంలో నిన్న సాయంత్రం ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం బీభత్సం సృష్టించింది. గ్రామంలోని సుమారు 20 ఇళ్ల రేకులు పూర్తిగా ఎగిరిపోవడంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులుఎదు ర్కొంటున్నాయి.ఈ ఘటన విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులు డాక్టర్ గౌతమ్ రాజు శు క్రవారం గ్రామాన్ని సందర్శించారు. ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రభుత్వం తరఫున తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.గ్రామస్తులు తమ సమస్యలను డాక్టర్ గౌతమ్ రాజుకు వివరించగా, సంబంధిత అధికారులతో మాట్లాడి నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, అధికారులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ప్రజల ప్రేమే అన్నా రాంబాబు
# సంపాదించిన చిరస్థాయి ఆస్తి..
### ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన నాయకుడు..

ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మే 29, (ప్రజా ప్రతిభ):



రాజకీయాల్లో సంపదలు, పదవులు, అధికారాలు శాశ్వతం కావు. కాలగమనంలో అవి మారిపోతాయి. కానీ ప్రజల గుండెల్లో సంపాదించుకున్న స్థానం మాత్రం ఎప్పటికీ చెరగదు. రాజకీయ నాయకుడి అసలైన సంపద ప్రజల విశ్వాసం, ప్రేమాభిమానాలు, వారి మనసుల్లో పొందిన స్థానం. ఈ మాటను నిజం చేస్తూ మార్కాపురం నియోజకవర్గంలో అన్నా రాంబాబు పేరు ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. రాజకీయ జీవితంలో అన్నా రాంబాబు సంపాదించుకున్నది కోట్లాది రూపాయల ఆస్తులు కాదు. ప్రజల ప్రేమ, అభిమానమే ఆయన అసలైన ఆస్తి అని నియోజకవర్గ ప్రజలు స్పష్టంగా చెబుతున్నారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఆయనను ఆప్యాయంగా పలకరించడం, బాగున్నారా అని మనస్ఫూర్తిగా అడగడం, కుటుంబ సభ్యుడిలా ఆత్మీయంగా పలకరించడం ఆయనపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనంగా నిలుస్తోంది. ప్రజల మధ్యకు వెళ్లిన ప్రతిసారి కనిపించే ఈ ఆదరణ సాధారణ విషయం కాదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే కాదు, ఏ పరిస్థితుల్లోనైనా ప్రజలతో అనుబంధాన్ని కొనసాగించగలగడం నిజమైన ప్రజానాయకుడి లక్షణమని పేర్కొంటున్నారు. ప్రజలు స్వచ్ఛందంగా చూపే ప్రేమే నాయకుడి గొప్ప విజయమని వారు అభిప్రాయపడుతున్నారు. గిద్దలూరు నియోజకవర్గ ప్రజలలో ఇప్పటికీ అన్నా రాంబాబు పేరు వినగానే అభిమానం వ్యక్తమవుతోంది. అవినీతి రహిత పాలన అందించిన నాయకుడిగా, ప్రజా సమస్యలను తన సమస్యలుగా భావించి పరిష్కారానికి కృషి చేసిన వ్యక్తిగా ఆయనను గుర్తు చేసుకుంటున్నారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో తీసుకున్న చొరవ, సామాన్య ప్రజల కోసం చూపిన కృషి, అందుబాటులో ఉండే తత్వం ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చాయి.ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన నాయకత్వాన్ని కోల్పోయామని గిద్దలూరు నియోజకవర్గంలోని వేలాది మంది బాధపడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. తమ సమస్యను ఎవరైనా వినాలంటే అన్నా రాంబాబు దగ్గరకు వెళ్లేవాళ్లమని, ఆయన ప్రతి సమస్యను శ్రద్ధగా విని పరిష్కారం చూపేవారని పలువురు గుర్తు చేసుకుంటున్నారు.రాజకీయాల్లో ఎంతకాలం ఉన్నామన్నది కాదు, ఆ కాలంలో ప్రజల కోసం ఎంత నిజాయితీగా పనిచేశామన్నదే ముఖ్యం. కొద్ది కాలం పరిపాలన చేసినా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలవగలిగితే అదే గొప్ప విజయమని అన్నా రాంబాబు రాజకీయ ప్రస్థానం చాటి చెబుతోందని వైయస్సార్ కాంగ్రెస్ శ్రేణులు అంటున్నాయి. ప్రజల గుండెల్లో నిలిచిపోవడం ప్రతి నాయకుడికి సాధ్యం కాదు. అది నిజాయితీ, నిబద్ధత, ప్రజల పట్ల అంకితభావంతోనే సాధ్యమవుతుంది. ఈ లక్షణాల వల్లే అన్నా రాంబాబు పేరు మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిందని చెబుతున్నారు.ఎక్కడికి వెళ్లినా ప్రజలు ప్రేమగా పలకరించడం, బాగున్నారా అని ఆత్మీయంగా అడగడం, తమ కుటుంబ సభ్యుడిలా భావించడం ఆయన సంపాదించుకున్న గొప్ప గౌరవం. అది ఏ పదవికీ, ఏ ఆస్తికీ దక్కని విలువైన గుర్తింపు.ప్రజల ప్రేమను మించిన ఆస్తి లేదని, ప్రజల విశ్వాసాన్ని మించిన గెలుపు లేదని అన్నా రాంబాబు జీవితం స్పష్టం చేస్తోందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ప్రజల కోసం చేసిన సేవే చిరస్థాయిగా నిలిచే సంపద అని వారు చెబుతున్నారు.వైయస్సార్ కాంగ్రెస్ శ్రేణులు కూడా ప్రజల ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతూ, అభివృద్ధి పథంలో ప్రజలతో కలిసి నడుస్తామని స్పష్టం చేస్తున్నాయి. ప్రజలే తమ బలం, ప్రజలే తమ ఆస్తి అనే నమ్మకంతో మరింత బలంగా పని చేస్తామని చెబుతున్నాయి.అవినీతి రహితం. అభివృద్ధి మా లక్ష్యం. ప్రజలే మా ఆస్తి. వైయస్సార్ కాంగ్రెస్ మార్కాపురం నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి అన్నా రాంబాబు...

## కృత్రిమ మేధస్సు యుగంలోనూ
# కిట్స్ విద్యార్థులకు ఉద్యోగాల జోరు..
### ఇండోసోల్ నియామక ప్రక్రియలో
### 14 మంది విద్యార్థుల ఎంపికతో మరోసారి సత్తా చాటిన కిట్స్..




ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మే 29, (ప్రజా ప్రతిభ):




ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధస్సు విస్తరిస్తూ ఉద్యోగ రంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీస్తున్న ఈ కాలంలోనూ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతూ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా చేయడంలో మార్కాపురంలోని కృష్ణ చైతన్య సాంకేతిక, విజ్ఞాన విద్యాసంస్థ మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. సాంకేతిక రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేస్తూ, ఉపాధి అవకాశాల దిశగా ముందుకు నడిపిస్తోంది.హైదరాబాద్‌కు చెందిన సాహితి కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా రామాయపట్నంలోని ఇండోసోల్ సోలార్ సంస్థ నిర్వహించిన నియామక ప్రక్రియలో కిట్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ నియామక ప్రక్రియలో మొత్తం 14 మంది విద్యార్థులు ఎంపిక కావడం కళాశాల చరిత్రలో మరో మైలురాయిగా నిలిచింది.ఎంపికైన విద్యార్థులు సోలార్ తయారీ విభాగాల్లో కీలక బాధ్యతలు నిర్వహించనున్నారు. వారికి సంవత్సరానికి సుమారు మూడు లక్షల వేతన ప్యాకేజీ అందించనున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. విద్యార్థుల ప్రతిభకు ఇది నిదర్శనమని కళాశాల వర్గాలు పేర్కొన్నాయి.ప్రస్తుతం ఉద్యోగ రంగంలో కేవలం విద్యార్హతలకే పరిమితం కాకుండా, పరిశ్రమలు కోరుకునే నైపుణ్యాలు, సాంకేతిక అవగాహన, సమస్యలను విశ్లేషించే సామర్థ్యం, సంభాషణా నైపుణ్యాలు, ప్రాయోగిక పరిజ్ఞానం అత్యంత అవసరమవుతున్నాయి. ఈ విషయాన్ని ముందుగానే గుర్తించిన కిట్స్ యాజమాన్యం విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా ప్రత్యేక శిక్షణ అందిస్తూ ఉద్యోగ అవకాశాల దిశగా పటిష్టంగా ముందుకు తీసుకెళ్తోంది.విద్యార్థులకు మొదటి సంవత్సరం నుంచే నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ వారిని పోటీ ప్రపంచానికి సిద్ధం చేస్తోంది. వ్యక్తిత్వ వికాసం, సంభాషణ నైపుణ్యాలు, సాంకేతిక శిక్షణ, సామర్థ్య పరీక్షలు, ఇంటర్వ్యూ సాధన, సమూహ చర్చలు వంటి విభిన్న అంశాలపై క్రమం తప్పకుండా శిక్షణ అందిస్తోంది.కళాశాలలో బోధనతో పాటు పరిశ్రమల అనుసంధాన కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు.పరిశ్రమల అవసరాలను అర్థం చేసుకుని వాటికి అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించే విధంగా శిక్షణా విధానాలను అమలు చేస్తున్నారు. దీని ఫలితంగానే విద్యార్థులు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు పొందుతున్నారని కళాశాల ప్రతినిధులు తెలిపారు.కృత్రిమ మేధస్సు, ఆటోమేషన్ ప్రభావంతో ఉద్యోగ రంగంలో మార్పులు వచ్చినప్పటికీ, సరైన నైపుణ్యాలు కలిగిన వారికి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని విద్యా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులను సాంకేతికంగా బలోపేతం చేయడం ద్వారా భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా తీర్చిదిద్దుతున్నట్లు కళాశాల వర్గాలు వెల్లడించాయి.ప్రముఖ సంస్థలతో నిరంతర అనుసంధానం కొనసాగిస్తూ, తరచూ నియామక ప్రక్రియలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తున్నారు. పరిశ్రమలతో అనుసంధానమైన శిక్షణ, ప్రత్యక్ష అనుభవం, ప్రాయోగిక అవగాహన విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోందని పేర్కొన్నారు.ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. వారి కృషి, పట్టుదల, శిక్షణకు ఇది ఫలితమని పేర్కొంది. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించింది.విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో సహకరించిన సంస్థ ప్రతినిధులకు కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది. భవిష్యత్తులో మరిన్ని సంస్థలతో అనుసంధానం పెంచుతూ విద్యార్థులకు మరింత విస్తృత అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని వెల్లడించింది.మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేస్తూ, విద్యతో పాటు ఉపాధికి బాటలు వేస్తున్న కిట్స్ మరోసారి తన ప్రతిభను నిరూపించుకుందని విద్యా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మార్కాపురం ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యతో పాటు ఉపాధి అవకాశాలు అందిస్తున్న ఈ విద్యాసంస్థ మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు.

# గోవధ ముఠా బట్టబయలు..
### అరవై గోవుల రక్షణ, భారీగా స్వాధీనం చేసుకున్న మాంసం నిర్వీర్యం..
### అక్రమ రవాణా, వధ వ్యవహారంపై పూర్తి స్థాయి దర్యాప్తు ప్రారంభం..

ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మే 29, (ప్రజా ప్రతిభ):



మార్కాపురం పట్టణంలో గోవధకు సంబంధించిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ధార్మిక సంఘాల ప్రతినిధులు, బిజెపి నాయకులు, పోలీసుల అప్రమత్తతతో గోవులను అక్రమంగా వధించి ఇతర రాష్ట్రాలకు తరలించేందుకు సిద్ధం చేసిన ముఠా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు రంగంలోకి దిగి దాడులు నిర్వహించగా భారీగా గోమాంసం స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో కొందరిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు సమాచారం. స్థానికంగా అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ధార్మిక సంఘాల ప్రతినిధులు, బిజెపి నాయకులు అప్రమత్తమై పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన పోలీసులు సంబంధిత ప్రాంతానికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో గోవులను వధించి మాంసాన్ని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధం చేసినట్లు గుర్తించారు. అక్కడ భారీ మొత్తంలో నిల్వ ఉంచిన గోమాంసాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు, మున్సిపల్ అధికారుల సహకారంతో ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించారు. ప్రజారోగ్యానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకుని వాటిని పూడ్చివేశారు. ఈ ఘటనలో మరో అరవై గోవులను రక్షించినట్లు సమాచారం. వాటిని తక్షణమే గోశాలకు తరలించి సంరక్షణ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. రక్షించిన గోవులకు అవసరమైన ఆహారం, వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఘటనపై స్పందించిన ధార్మిక సంఘాల ప్రతినిధులు, బిజెపి నాయకులు గోవులను అక్రమంగా వధించి విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇది కేవలం చట్టవిరుద్ధ చర్య మాత్రమే కాకుండా ప్రజల మనోభావాలను దెబ్బతీసే చర్య అని పేర్కొన్నారు. పట్టణ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి అక్రమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు గతంలోనూ వినిపించాయని, వాటిపై పూర్తిస్థాయి నిఘా అవసరమని వారు పేర్కొన్నారు. గోవుల అక్రమ రవాణా, వధకు పాల్పడుతున్న ముఠాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన వెనుక ఉన్న ముఠా ఎంత పెద్దది, ఎక్కడి నుంచి గోవులను తరలించారు, ఏ మార్గాల ద్వారా ఇతర రాష్ట్రాలకు మాంసం పంపించేందుకు సిద్ధం చేశారు అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. అదుపులోకి తీసుకున్న వారిని ప్రశ్నిస్తూ మరిన్ని వివరాలు సేకరిస్తున్నారు. స్థానికులు కూడా ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ఇలాంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరగడం ఆందోళనకరమని పేర్కొంటున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన పర్యవేక్షణ అవసరమని అభిప్రాయపడుతున్నారు. పోలీసులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. అయితే దర్యాప్తు పూర్తి చేసి బాధ్యులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకున్నప్పుడే ఇలాంటి ఘటనలకు అడ్డుకట్ట పడుతుందని అభిప్రాయపడుతున్నారు.మార్కాపురం పట్టణంలో ఈ ఘటన ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు ఈ వ్యవహారంపై పారదర్శకంగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



### ఓటరు జాబితా సవరణలపై

# బూత్ స్థాయి ప్రతినిధులకు అవగాహన సదస్సు..

## ప్రతి బూత్‌లో పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని పిలుపు..

**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 29, (ప్రజా ప్రతిభ):**



మార్కాపురం జిల్లా, అర్ధవీడు మండలంలో బూత్ స్థాయి ప్రతినిధులకు ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జి కె.పి. నాగార్జున రెడ్డి పాల్గొని బూత్ స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమగ్రంగా వివరించారు.ఓటరు జాబితా సవరణలు, కొత్త ఓటర్ల నమోదు, ఇంటింటి పరిశీలన, ఓటర్ల వివరాల ధృవీకరణ వంటి అంశాలను అత్యంత బాధ్యతతో చేపట్టాలని సూచించారు. ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో పేరు నమోదు అయ్యేలా క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన అంశమని పేర్కొన్నారు. ప్రతి బూత్‌లో పూర్తి స్థాయిలో పరిశీలన చేపట్టి తప్పులు సరిదిద్దడం, కొత్తగా అర్హత పొందిన వారిని నమోదు చేయించడం, వివరాల్లో మార్పులు ఉంటే వాటిని సకాలంలో నమోదు చేయించడం వంటి అంశాలపై ప్రతినిధులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.బూత్ స్థాయి ప్రతినిధులు పార్టీకి వెన్నెముకలాంటివారని, వారి కృషి పార్టీ బలోపేతానికి కీలకమని తెలిపారు. ప్రతి గ్రామంలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరించి ప్రజలతో మమేకం కావాలని పిలుపునిచ్చారు.ప్రతి ఇంటికీ చేరుకుని ఓటర్ల సమస్యలు తెలుసుకోవడం, అవసరమైన మార్గదర్శకత్వం అందించడం ద్వారా ప్రజల్లో పార్టీపై విశ్వాసాన్ని మరింత పెంచాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బూత్ స్థాయిలో పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ప్రతి ప్రతినిధి పూర్తి బాధ్యతతో పని చేసి పార్టీ విజయానికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ మేడూరి వెంకట్ రావు, మాజీ ఎంపీపీ, జిల్లా పంచాయతీరాజ్ విభాగ అధ్యక్షుడు నన్నెబోయిన రవి కుమార్, మండల కన్వీనర్ యేరువ కృష్ణారెడ్డి, రాష్ట్ర బూత్ కమిటీ విభాగ కార్యదర్శి పత్తి రవిచంద్రతో పాటు మండల ముఖ్య నాయకులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, అన్ని బూత్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రతి బూత్‌లో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజలతో అనుసంధానం పెంచేందుకు సమష్టిగా పనిచేస్తామని స్పష్టం చేశారు.

### బాధిత కుటుంబానికి

# అండగా మూడు లక్షల విరాళం..

## గిద్దలూరు నియోజకవర్గ ఇంచార్జి కె.పి. నాగార్జున రెడ్డి.. నాగులవరం గ్రామంలో మానవత్వాన్ని చాటిన వైఎస్సార్సిపి నాయకులు, దాతలు..

**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 29, (ప్రజా ప్రతిభ):**



మార్కాపురం జిల్లా,అర్ధవీడు మండలం, నాగులవరం గ్రామంలో ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు పూర్తిగా దగ్ధమై నివాసం కోల్పోయిన బాధిత కుటుంబానికి గ్రామ వైఎస్సార్సిపి నాయకులు అండగా నిలిచారు. గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు, దాతల సహకారంతో మూడు లక్షల రూపాయలు విరాళంగా సేకరించి బాధిత కుటుంబానికి అందజేశారు.గిద్దలూరు నియోజకవర్గ ఇంచార్జి కె.పి. నాగార్జున రెడ్డి సమక్షంలో ఈ సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. విపత్కర పరిస్థితుల్లో కుటుంబానికి చేయూత అందించడం ద్వారా గ్రామ ప్రజలు మానవత్వాన్ని చాటారని పలువురు అభినందించారు.ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో బాధిత కుటుంబం నివాసాన్ని పూర్తిగా కోల్పోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఇంట్లోని సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతి కావడంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో నిలిచింది. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామ వైఎస్సార్సిపి నాయకులు వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి సహాయం అందించేందుకు ముందుకొచ్చారు.గ్రామ ప్రజల సహకారంతో విరాళాలు సేకరించి తక్కువ సమయంలోనే మూడు లక్షల రూపాయలు సమీకరించడం విశేషం.గ్రామ ప్రజల ఐక్యత, సేవాభావం ఈ సందర్భంగా మరోసారి చాటుకుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా నాగార్జున రెడ్డి మాట్లాడుతూ, కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి సహాయం అందించేందుకు ముందుకొచ్చిన దాతలందరికీ అభినందనలు తెలియజేశారు. సమాజంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.కష్టకాలంలో తోటి మనుషులకు చేయూతనివ్వడం గొప్ప మానవతా విలువ అని పేర్కొన్నారు.బాధిత కుటుంబం మళ్లీ సాధారణ జీవితంలోకి రావడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు.గ్రామ వైఎస్సార్సిపి నాయకులు, కార్యకర్తలు, దాతలు కలిసికట్టుగా స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ సహాయం బాధిత కుటుంబానికి కొంత ఉపశమనం కలిగిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.బాధిత కుటుంబ సభ్యులు సహాయం అందించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. తమ కష్ట సమయంలో అండగా నిలిచిన వారిని జీవితాంతం మరువబోమని పేర్కొన్నారు.ఈ ఘటన గ్రామంలో ఐక్యతకు, మానవత్వానికి నిదర్శనంగా నిలిచిందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే లక్ష్యం..

## సమష్టి కృషితో విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలి..

**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 29, (ప్రజా ప్రతిభ):**





ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల భవిష్యత్ నిర్మాణమే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి సామా సుబ్బారావు పిలుపునిచ్చారు. విద్యా రంగంలో నాణ్యత పెంపుతో పాటు ప్రతి విద్యార్థికి మెరుగైన విద్య అందేలా కృషి చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని స్పష్టం చేశారు.కంభం పట్టణంలోని వాసవి విద్యా సంస్థల సమావేశ మందిరంలో అర్ధవీడు, బేస్తవారిపేట, కంభం, తర్లుబాడు మండలాల విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో విద్యా పరిస్థితులు, విద్యార్థుల నమోదు, హాజరు, మౌలిక వసతులు, బోధన ప్రమాణాలపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య పెంపు, చదువు మధ్యలో మానేసిన వారి వివరాలు, కొత్తగా చేరికలు వంటి అంశాలను అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు చేరేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల్లో మరింత విశ్వాసం పెంపొందించేలా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. బోధనలో నాణ్యత పెంచడం, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపడం, పాఠశాలల్లో సానుకూల వాతావరణం కల్పించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు.వృత్తి నిర్వహణలో చిత్తశుద్ధి, బాధ్యత, పారదర్శకత అత్యంత అవసరమని స్పష్టం చేశారు. బృందాలుగా పనిచేస్తూ సమయపాలన పాటిస్తే విద్యా రంగంలో విశిష్ట ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. విద్యార్థుల హాజరు, అభ్యాస నైపుణ్యాలు, పాఠశాల పరిశుభ్రత, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.మండలాల వారీగా మొత్తం విద్యార్థుల సంఖ్య, తరగతి మార్పులు, ప్రవేశాల శాతం, చదువు మానేసిన వారి వివరాలను సమీక్షించారు. మెరుగైన పనితీరు కనబరిచిన అధికారులను అభినందించారు. వెనుకబడిన ప్రాంతాల్లో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి విద్యార్థులను తిరిగి పాఠశాలలకు తీసుకురావాలని ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలా అభివృద్ధి చేసి విద్యార్థులకు మెరుగైన భవిష్యత్తు అందించాలంటే ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేస్తే ప్రభుత్వ విద్యా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.ఈ సమావేశంలో నాలుగు మండలాల ఎంఈవోలు, క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు, సీఆర్పీలు, మండల సమన్వయకర్తలు, డేటా ఆపరేటర్లు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# కాలనీవాసులకు చెరువును తలపిస్తున్న రహదారి కష్టాలు..

## పూలసుబ్బయ్య కాలనీలో దారుణంగా మారిన రోడ్డు.. తక్షణమే పునరుద్ధరణ చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి..

**ప్రకాశం జిల్లా బ్యూరో / కుందురు శ్రీనివాసరెడ్డి, మే 29, (ప్రజా ప్రతిభ):**

మార్కాపురం పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీలో బిలాల్ మస్జిద్ ఎదురుగా ఉన్న వీధి దారుణ స్థితికి చేరుకుంది. భారీ గుంతలు, నిల్వ నీటితో ఆ రహదారి చిన్న చెరువును తలపించేలా మారిపోయింది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి చర్యలు లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను పదేపదే వివరించినా స్పందన లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.రహదారి పూర్తిగా దెబ్బతినడంతో చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది.నీరు నిల్వ ఉండటంతో గుంతలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు పెరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.ప్రతిరోజూ ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ద్విచక్ర వాహనదారులు జారి పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను తరలించాల్సి వచ్చినా రహదారి దుస్థితి అడ్డంకిగా మారుతోందని చెబుతున్నారు.పిల్లలు పాఠశాలలకు వెళ్లే సమయంలో, వృద్ధులు బయటకు వెళ్లే సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో వెలుతురు తక్కువగా ఉండటంతో ప్రమాద భయం మరింత పెరుగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.ఈ రహదారి పునరుద్ధరణ కోసం పలుమార్లు అధికారులను కోరినప్పటికీ ఫలితం లేకపోవడంతో కాలనీవాసులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టకపోవడం బాధాకరమని అంటున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే రహదారి పునరుద్ధరణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. సమస్య తీవ్రతను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాలనీవాసుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణ చర్యలు తీసుకుని రహదారిని బాగుచేస్తే ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## ప్రభుత్వ బడుల్లో ప్రవేశాలకు బడి పిలుస్తోంది కార్యక్రమం





**శాంతిపురం,మే 29 (ప్రజా ప్రతిభ):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడి పిలుస్తోంది కార్యక్రమాన్ని శుక్రవారం మండల పరిధిలోని పలు గ్రామాలలో శాంతిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్లస్టర్ కు సంబంధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సిఆర్పి ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున ఆధ్వర్యంలో శాంతిపురం మండల విద్యాశాఖ అధికారులు సెల్వ పాండియన్,చంద్రమ్మ ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలన్నారు.2026-27ఈ విద్య సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయని, అర్హత అనుభవం కలిగిన ఉపాధ్యాయులచే ఉచిత విద్య బోధన,ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం వర్తింపు అని అన్నారు.ప్రభుత్వ పాఠశాలలో బుక్స్, యూనిఫామ్,స్కూల్ బ్యాగ్,మధ్యాహ్న భోజన పథకం,ఆధునిక వసతి కల్పన వంటి సౌకర్యాలను కల్పిస్తుందని,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.పాఠశాల విద్యను ప్రోత్సహించడం,అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ఐదేళ్లు నిండిన పిల్లలను చేర్చుకోవడం,ఇంటింటి ప్రచారం నిర్వహించడం మరియు ప్రభుత్వ బడుల్లో అందుతున్న ఉచిత విద్య, వసతులపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఆనంద్,రఘుపతి రెడ్డి,కళ్యాణ్ రామ్,దయానంద, ఉమాపతి,మహేష్ ,సిఆర్పి మునెప్ప,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఐ. టీ. ఐ లో కిశోరి వికాస కార్యక్రమం...



**వెంకటగిరి, మే29(ప్రజా ప్రతిభ ):**

ఐ. సి.డి. యస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం వెంకటగిరి ప్రభుత్వ ఐ. టీ. ఐ కిశోర బాలురలకు స్కిల్ డెవలప్మెంట్ పై అవగాహనా కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమం కు ముఖ్య అతిధిగా జిల్లా కో -ఆర్డినేటర్ కృష్ణ మంజరి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మారక ద్రవ్యలు, డ్రగ్స్ వాడకం ద్వారా కలిగే ఇబ్బందులను తెలిపారు.అలాగే ఫాక్స్ యాక్ట్ గురించి అవగాహనా కల్పించారు. సి. డి . పి. వో శంషాద్ బేగం మాట్లాడుతూ సమాజంలో వ్యక్తిగత, సామాజిక ఎదుగుదల ముఖ్యమని తెలిపారు. బాల్య వివాహాలలు నిర్మూలన, నైపుణ్యభివృద్ధి పై అవగాహనా కల్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ గీత,కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఒక నెల ఒక నియోజకవర్గం నాలుగు సందర్శనాలు కార్యక్రమం వాకాడు,




**వాకాడు మే 29 ప్రజా ప్రతిభ**

తిరుపతి జిల్లా వాకాడు..వాకాడు రెవెన్యూ కార్యాలయం ఆవరణంలో జరుగుతున్న ఒక నెల ఒక నియోజకవర్గ నాలుగు సందర్శన కార్యక్రమానికి అధికారులే ఎక్కువమంది హాజరై ఉన్నారు, అర్జీదారులు మాత్రం అతి స్వల్పముగా ఉన్నారు. ఈ కార్యక్రమం వాకాడు, చిట్టమూరు మండలాల ప్రజల కోసం ఏర్పాటు చేసినది. గత వారం కూడా ఊహించిన స్థాయిలో అర్జీదారులు హాజరు కాలేదు. ఈరోజు కార్యక్రమానికి గూడూరు శాసనసభ్యులు వస్తారని అధికారులు ప్రకటించిన అర్జీదారులు ఊహించని స్థాయిలో రాకపోవడం విశేషం!. మరికొద్ది నిమిషాల్లో శాసనసభ్యులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని తెలిసింది. అయినప్పటికీ ఖాళీ కుర్చీలో దర్శనమిచ్చాయి.

# గురువుల సేవలు సమాజానికి ఎల్లప్పుడూ ఆదర్శప్రాయం



నాతవరం, మే,29,(ప్రజా ప్రతిభ)

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత శెట్టి రామకృష్ణ గతంలో ట్యూషన్ సెంటర్ నడుపుతూ నాతవరం పరిసర ప్రాంతాల్లోని అనేకమంది యువతకు క్రమశిక్షణ మంచి విలువలు తో కూడిన విద్యను అందించడంతో విదేశాల్లో స్థిరపడి అనేకమంది ఉన్నారు సమాజ నిర్మాణంలో విశిష్ట సేవలు అందించిన మహోన్న వ్యక్తికి నాతవరం పోలీస్ స్టేషన్కు ఆహ్వానించి పోలీస్ శాఖ తరపు నుండి శుక్రవారం మాస్టర్ను నాతవరం ఎస్సై వై తారకేశ్వరరావు ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగన్నాథం, అంకంరెడ్డి రమణ, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ కు కంప్యూటర్లు ఇన్వెర్టర్ లు అందజేసిన లెక్కల ఎన్ఆర్ఐ ఫౌండేషన్



నాతవరం,మే 29(ప్రజా ప్రతిభ ):

నాతవరంమండలం చెర్లోపాలెం లెక్కల ఎన్ఆర్ఐ ఫౌండేషన్ అధినేత లెక్కల వెంకటేశ్వరరావు నాతవరం పోలీస్ స్టేషన్ కు మూడు కంప్యూటర్లు, ఇన్వర్టర్ శుక్రవారం ఎస్సై వై, తారకేశ్వరరావుకు అందజేశారు ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో ఎన్నారై లెక్కల వెంకటేశ్వరరావు అనుచరులు పనిమీద పోలీస్ స్టేషన్ రావడంతో కరెంటు లేక ఇబ్బంది ఇబ్బంది పడ్డారు. ఈ విషయాన్ని ఎన్నారై దృష్టికి తీసుకొని వెళ్లడంతో వెంటనే స్పందించి కంప్యూటర్లు, ఇన్వర్టర్ ను అందజేశారు ఈ సందర్భంగా నాతవరం పోలీసులు ఇలాంటి సేవా దృక్పథంతో ముందుకు సాగాలని కోరుకుంటూ అభినందనలు తెలియజేశారు.

# కిశోర వికాస శిక్షణ కార్యక్రమం

## విద్య మరియు కెరియర్ ప్రాముఖ్యత మార్గదర్శకత్వం మార్గదర్శకత్వలా నైపుణ్యాల అభివృద్ధి



పాయకరావుపేట, మే 29(ప్రజా ప్రతిభ):

అనకాపల్లి జిల్లా నక్కపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పాయకరావుపేట మండలం మంగవరం సెక్టార్ గోపాలపట్నం పంచాయతీ పెద్దిరాజు పాలెం కేంద్రంలో కౌమారదశ బాలబాలికలకు "కిశోర వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం"ను మంగళవారం నిర్వహించారు. సూపర్వైజర్ రంజాన్ బీబీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మే 1 నుండి జూన్ 9 వరకు ప్రతి మంగళవారం, శుక్రవారం ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 11 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలబాలికలను కౌమారదశ వారిగా గుర్తించి, వారి సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేక శిక్షణలు అందిస్తున్నామని పేర్కొన్నారు. జీవన నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించడం, శారీరక వ్యాయామం, క్రీడలు, ఆటల ప్రాముఖ్యతపై బాలబాలికలకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. అలాగే "నా అవసరాలు -- మన సవాళ్లు" అనే అంశంపై కూడా వారికి మార్గనిర్దేశం చేసినట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో సంఘాలను ఏర్పాటు చేసి ప్రతి మంగళవారం, శుక్రవారం బాలబాలికల సమస్యలను తెలుసుకుని వారికి సరైన మార్గదర్శనం అందిస్తున్నట్లు చెప్పారు. బాలల రక్షణ, ఆరోగ్యం, విద్య, లింగ సమానత్వం, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు అమ్మాజీ, నూకరత్నం, వెంకటలక్ష్మి ఏఎన్ఎం ఆశా, కిశోర బాలికలు, బాలబాలికలు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రమాద బాధితుడు రావి శివను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే "కంబాల, వీసం"

నక్కపల్లి, మే 29, (ప్రజా ప్రతిభ) :

నక్కపల్లి మండల కేంద్రమైన నక్కపల్లి రాజీవ్ నగర్లో ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడిన రావి శివను పాయకరావుపేట వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, పరామర్శించారు. ఇంటి మేడపై నుంచి జారిపడటంతో శివ చేతికి, నడుముకి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆపరేషన్ చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనను గురువారం పలువురు నాయకులు కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శివ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే, జోగులు, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందరావు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి సురకాసుల గోవింద్, మాజీ సర్పంచ్ భార్గవ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు పోచిన నరేష్, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు



# రాజయ్యపేటలో ఉపాధి పనుల్లో అక్రమాలు:

## జూమ్ కాల్తో మస్టర్లు, వీఆర్పీపై చర్యలు శూన్యం

## 15 రోజులుగా ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు, సోమవారం విచారణకు హామీ, డిప్యూటీ సీఎం ఫిర్యాదు చేస్తామని గ్రామస్తుల హెచ్చరిక



నక్కపల్లి, మే 29: (ప్రజా ప్రతిభ) :

నక్కపల్లి మండలం రాజయ్యపేట పంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో తీవ్ర అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆన్లైన్ జూమ్ కాల్ ద్వారా ఇతర ప్రాంతాల్లో ఉన్న వారికి మస్టర్లు వేస్తున్న వీఆర్పీపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజుల క్రితం రాజయ్యపేట పంచాయతీలో ఉపాధి పనుల్లో జరిగిన అక్రమాలపై శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో, ఏపీవోలను కలిసి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఆన్లైన్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ జూమ్ కాల్ ద్వారా మస్టర్లు వేయడం, ఇతర ప్రాంతాల్లో ఉన్న వారిని గ్రామంలో ఉన్నట్లు చూపించడం సైబర్ నేరమని గ్రామస్తులు మండిపడ్డారు. ప్రభుత్వ నిధులను ఇలా దుర్వినియోగం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే సమగ్ర విచారణ జరిపి ఉపాధి పనుల్లో తప్పులను అరికట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని అధికారులకు స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన అధికారులు, సోమవారం ఉపాధి పనుల్లో భాగంగా గ్రామానికి వచ్చి జరుగుతున్న అవకతవకలను పర్యవేక్షించి, విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షులు వెలగా సుధాకర్ రావు, ప్రధాన కార్యదర్శి బొంది గురన్న, రాజయ్యపేట జనసేన గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి కోదండరావు (బుజ్జి), నాయకులు పిక్కి చిన్నారి, పిక్కి కోటి, మైలపల్లి రాము, పిక్కి కోటేశ్వరరావు, పిక్కి కాశి, పిక్కి ఆదిరాజు, కోట ముసలి, బొందలపు అప్పలరాజు, వాసుపల్లి నూకరాజు, పిక్కి రాజు తదితరులు పాల్గొన్నారు.

# కొమ్మిపాడు గ్రామంలో "పల్లె వీక్షణ" కార్యక్రమం...



వెంకటగిరి, మే29(ప్రజా ప్రతిభ ):

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రజా సమస్యల త్వరితగతిన పరిష్కారమే ధ్యేయంగా సైదాపురం మండలం కొమ్మిపాడు గ్రామంలో శుక్రవారం జరిగిన "పల్లె వీక్షణ" కార్యక్రమంలో శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ,శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ శ్రీ హిమాన్షు శుక్లా ఐ. ఏ. ఎస్ లతో పాటు అన్ని ప్రభుత్వ జిల్లా, మండల శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కొమ్మిపాడు గ్రామం వర్షాధార ప్రాంతం కావడంతో 'జల హారతి' కార్యక్రమం కింద చేపట్టిన వివిధ నీటి నిల్వ, సంరక్షణ పనులను కలెక్టర్,ఎమ్మెల్యే కురుగొండ్ల పరిశీలించారు. వర్షపు నీటిని చెరువుల్లోకి చేర్చి భూగర్భ జలాలను పెంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొమ్మిపాడు ప్రాంతంలో ప్రధాన పంట అయిన నిమ్మ తోటలను అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించారు. సాగు విధానాలు, చీడపీడల నివారణపై రైతులతో మాట్లాడారు.



### వర్మీ కంపోస్ట్ కేంద్రం:

గ్రామంలోని తడి, పొడి చెత్త ద్వారా వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీ కేంద్రాన్ని (ఎస్. డ బేల్యూ. పి సి ) పరిశీలించారు. ఈ సేంద్రీయ ఎరువు నిమ్మ సాగుకు ఎంతో మేలు చేస్తుందని, దీని ఉత్పత్తిని మరింత పెంచాలని కలెక్టర్ సూచించారు.

### అంగన్వాడీ కేంద్రం సందర్శన:

అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లల ఎత్తు, బరువుల రికార్డులను తనిఖీ చేశారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి వారం వారి ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు.

### తక్షణ సమస్యల పరిష్కారం -- నిధుల మంజూరు:

గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తక్షణమే స్పందించి పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేశారు. అంగన్వాడీ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణానికి తక్షణ అనుమతులు ఇచ్చారు. తాగునీటి సమస్యను పరిష్కరించడానికి ఓహెచ్ఎస్ఆర్ నుండి నేరుగా పైప్లైన్ వేసేందుకు రూ. 2.5 లక్షలు మంజూరు చేశారు. ఇళ్లకు ఆనుకుని ఉన్న ప్రమాదకర విద్యుత్ స్తంభాలను తొలగించడం లేదా వాటి ఎత్తు పెంచేలా చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో పరిపాలన ప్రజలకు దూరంగా ఉండేదని, కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అధికారులు నేరుగా గ్రామాలకే వచ్చి సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపారు. ఈ గ్రామ పంచాయతీ పరిధిలో గత రెండు సంవత్సరాలలో రూ. 3 కోట్ల 42 లక్షల 88 వేల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టామని వెల్లడించారు. అలాగే, ముఖ్యమంత్రి సహాయ నిధి (సి. యం. ఆర్. ఎఫ్ ) కింద ఈ రోజు 11 మంది లబ్ధిదారులకు రూ. 16 లక్షల 70 వేల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ను దేశంలోనే ధనిక రాష్ట్రంగా మార్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళలకు రాజకీయ రిజర్వేషన్ ప్రకటించడం హర్షనీయం



వాకాడు మే 29 ప్రజా ప్రతిభ

తిరుపతి జిల్లా వాకాడు. రాష్ట్ర ముఖ్యమంత్రి మహిళలకు 33% రాజకీయ అవకాశాలు కల్పించాలని ప్రకటించడం పట్ల వాకాడు మండలం టిడిపి మహిళా అధ్యక్షురాలు చిరంజీవిమ్మ హర్షం వ్యక్తం చేస్తూ తన అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ఆమె మాటలు అక్షర రూపంలో వాకాడు మండల మహిళా టిడిపి అధ్యక్షురాలిగా నేను ఈసారి జరిగిన మహానాడులో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు మహిళలకు 33 శాతం రాజకీయ అవకాశాలు కల్పించాలని ప్రకటించడం ఎంతో చారిత్రాత్మక నిర్ణయంగా భావిస్తున్నాను. ఈ నిర్ణయం వల్ల గ్రామీణ ప్రాంత మహిళల్లో కొత్త ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. రాజకీయాల్లో మహిళలు మరింత ముందుకు రావడానికి ఇది గొప్ప ప్రేరణగా నిలుస్తుంది. ప్రత్యేకంగా మహిళలకు నాయకత్వ అవకాశాలు పెరగడం ద్వారా గ్రామాల అభివృద్ధిలో మహిళల పాత్ర మరింత బలపడుతుంది. మహిళలు తమ ఆలోచనలు, తెలివితేటలతో తమ ప్రాంతాలను అభివృద్ధి దిశగా తీసుకెళ్లగలరనే నమ్మకం ఈ మహానాడు ద్వారా కలిగింది. స్వర్గీయ ఎన్టీఆర్ గారి ఆశయాలు, మహిళా సాధికారత భావనలను ముందుకు తీసుకెళ్లే దిశగా ఈ నిర్ణయం ఎంతో ఉపయోగపడుతుంది. మహిళలకు రాజకీయాల్లో పెద్ద స్థానం ఇవ్వాలని చంద్రబాబు నాయుడు గారు తీసుకున్న నిర్ణయం భవిష్యత్తులో ఎన్నో మహిళలకు మార్గదర్శకంగా నిలుస్తుంది. "మహిళలు పెద్ద పాత్రకు సిద్ధంగా ఉండాలి" అని చంద్రబాబు గారు పిలుపునివ్వడం మహిళా లోకానికి గొప్ప ఉత్సాహాన్ని ఇచ్చింది. అలాగే వాకాడు మండల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఆయన కృషితో వాకాడు ప్రాంతానికి అనేక పరిశ్రమలు వస్తుండటంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. ఆర్థిక అభివృద్ధి దిశగా వాకాడు ముందుకు సాగుతోంది. ఈ ఏడాది మహానాడు మహిళల రాజకీయ భవిష్యత్తుకు కొత్త దిశను చూపింది. రాజకీయాల్లోకి రావాలనుకునే యువతులు, మహిళలకు ఇది ఒక స్ఫూర్తిదాయకమైన ప్రారంభం అని నేను నమ్ముతున్నాను.

# కెనమాకులపల్లి పంచాయతీలో సేంద్రియ ఎరువుల అమ్మకాలు ప్రారంభం

శాంతిపురం,మే 29(ప్రజా ప్రతిభ):

కెనమాకులపల్లి గ్రామ పంచాయతిలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రం (ఎస్ డబ్ల్యూ పి సి) ద్వారా తయారు చేయబడిన సేంద్రియ ఎరువుల అమ్మకాలను శుక్రవారం డిప్యూటీ ఎంపీడీవో రవి నాయక్,పంచాయతీ కార్యదర్శి స్వాతి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఒక కేజీ 10/- రూపాయలకు చొప్పున 2 టన్నులు రైతులకు విక్రయించడం జరిగిందన్నారు. ప్రధాన మంత్రి మరియు రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపు మేరకు ప్రతి గ్రామంలో ఎక్కువ సంఖ్యలో సేంద్రీయ ఎరువులు వాడకం ద్వారా పంటలు ఎక్కువగా పండించుకోవచ్చు అన్నారు. ఈ సేంద్రీయ ఎరువుల ద్వారా పంటల దిగుబడి ఎక్కువగా ఉన్నందున రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు రైతులు పాల్గొన్నారు.



## 2027 గోదావరి పుష్కరాల

# ఘాట్ల అభివృద్ధికి రూ. 58 కోట్లతో ప్రతిపాదనలు

## ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ




రాజానగరం మే 29 (ప్రజా ప్రతిభ న్యూస్)

మునికూడలి పుష్కర్ ఘాట్‌ను 'మోడల్ ఘాట్'గా తీర్చిదిద్దనున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జల వనరుల శాఖ అధికారులతో రాజానగరం శాసనసభ్యులు శ్రీ బత్తుల బలరామకృష్ణ ఉన్నత స్థాయి సమీక్ష.రాబోయే గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని సీతానగరం మండలంలోని గోదావరి ఘాట్లకు యాత్రికులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని, కొత్త ఘాట్ల నిర్మాణంతో పాటు ప్రస్తుతం ఉన్న ఘాట్లను సర్వాంగ సుందరంగా అభివృద్ధి చేయనున్నట్లు రాజానగరం శాసనసభ్యులు శ్రీ బత్తుల బలరామకృష్ణ తెలిపారు. శుక్రవారం రాజానగరంలోని కార్యాలయంలో జల వనరుల శాఖ ( వాటర్ రిసోర్సెస్.డిపార్ట్మెంట్ ) అధికారులతో ఆయన ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ గారు మాట్లాడుతూ...నియోజకవర్గ పరిధిలోని నీటి పారుదల, కాలువలు మరియు పుష్కర ఘాట్ల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు.సీతానగరం మండలంలో రూ. 58 కోట్ల అంచనా వ్యయంతో 354 మీటర్ల మేర మొత్తం 13 ఘాట్లను అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో భాగంగా ప్రస్తుత ఘాట్ల ఆధునీకరణ ప్రస్తుతం ఉన్న 5 ఘాట్లను రూ. 2.46 కోట్లతో పునరుద్ధరిస్తారు. మరో 3 ఘాట్లను రూ. 1.09 కోట్లతో విస్తరించడం జరుగుతుంది. రూ. 5.83 కోట్ల అంచనా వ్యయంతో కొత్తగా మరో 8 ఘాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.




### మునికూడలి ఘాట్ 'మోడల్ ఘాట్'గా మార్పు :

మునికూడలి పుష్కర్ ఘాట్‌ను ఒక అద్భుతమైన 'మోడల్ ఘాట్'గా అభివృద్ధి చేయాలని గౌరవ ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు నిర్ణయించారని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వెల్లడించారు. దానికి అనుగుణంగానే తగిన ప్రతిపాదనలను వేగంగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

అలాగే, బొబ్బిలంక గ్రామంలో అఖండ గోదావరి ఎడమ గట్టు అభివృద్ధి కొరకు రూ. 117 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.నియోజకవర్గంలోని పలు సాగునీటి సమస్యలపై ఎమ్మెల్యే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్: రూ. 44 లక్షలతో చేపట్టాల్సిన తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ ఓ ఎం(ఆపరేషన్. అండ్ మెయింటినెన్స్ ) పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. రామవరపు ఆవ నుంచి చెరుకు ఆవ మీదుగా కూనవరం డ్రైన్‌ను అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరనున్నట్లు తెలిపారు.పురుషోత్తపట్నం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం కింద చినకొండేపూడి పరిధిలో పైప్‌లైన్ పైకి లేచిపోవడం వల్ల 100 ఎకరాల వ్యవసాయ భూమి పాడైపోయింది. దీనికి సంబంధించి తక్షణమే అంచనాలు (.ఎస్టిమేట్స్ ) తయారు చేసి ఇస్తే, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.పల్లకడియం రైతుల ఇబ్బందులను తొలగించేందుకు వెంకట నగరం పంపింగ్ స్కీమ్ ద్వారా నాలుగు చెరువులకూ సాగునీరు అందిస్తాం. ఇందుకోసం 1.5 కిలోమీటర్ల మేర కాలువను అభివృద్ధి చేయాల్సి ఉంది.ఊర చెరువు పనులను త్వరలోనే చేపట్టి కనుపూరు ప్రాంత రైతులకు పూర్తి స్థాయిలో మేలు చేకూరుస్తాం.దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న జైకా (జే ఐ సి ఏ ) నిధుల విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో చాగల్నాడు, పుష్కర తదితర సాగునీటి పథకాల ప్రగతిపై కూడా ఆయన సమగ్రంగా సమీక్షించారు.ఈ సమావేశంలో జల వనరుల శాఖ అధికారులు, ఇంజనీర్లు మరియు నియోజకవర్గ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## లక్ష్మీపురంలో
## ఆపరేషన్ క్లియర్ స్వీప్ నిర్వహణ



కుప్పం, మే 29, (ప్రజా ప్రతిభ):

కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీపురం ప్రాంతంలో శుక్రవారం "ఆపరేషన్ క్లియర్ స్వీప్" కార్యక్రమాన్ని మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విస్తృతంగా నిర్వహించారు. పట్టణ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, దోమల వ్యాప్తిని నివారించడం, ప్రజల్లో పారిశుధ్యంపై అవగాహన కల్పించడం లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది వీధుల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, కాలువల్లోని మురుగును శుభ్రం చేశారు. అలాగే రోడ్ల పక్కన ఉన్న మురికి నీటి నిల్వలను తొలగించి, బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చెత్తను వేర్వేరుగా సేకరించాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మున్సిపల్ సిబ్బందికి అందించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అభ్యర్థి లోకేష్ ,మున్సిపల్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు. లక్ష్మీపురం ప్రాంతాన్ని శుభ్రంగా ఉంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

## పాతపేట రోడ్డు విస్తరణ పనులపై సమీక్ష



కుప్పం, మే 29, (ప్రజా ప్రతిభ):

కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని రీచ్-2 పాతపేట రోడ్డు విస్తరణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కడ అడ్వైజర్ ఎస్. రాజ్ కుమార్, మున్సిపాలిటీ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్ అధికారులతో కలిసి పాతపేట ప్రాంతంలో పర్యటించారు. రోడ్డు విస్తరణలో భాగంగా ప్రభావితమవుతున్న భవనాల యాజమాన్యాలతో వారు ప్రత్యక్షంగా మాట్లాడి, అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, ట్రాఫిక్ సమస్యలను తగ్గించడం, పట్టణ అభివృద్ధిని మరింత వేగవంతం చేయడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ రోడ్డు విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. అధికారులు రోడ్డు విస్తరణకు సంబంధించిన సాంకేతిక వివరాలను వివరించగా, పనులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని, అవసరమైన చోట తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# మహానాడు సూపర్ సక్సెస్

## టిడిపి కార్యకర్తలు, నాయకులు
## సత్తా చాటారన్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి కన్నబాబు

గోకవరం మే 29( ప్రజా ప్రతిభ న్యూస్)



ఊరు ,వాడ ప్రతిచోట వర్చువల్ మహానాడు మహా జాతరను తలపించే విధంగా పండుగ వాతావరణం తలపించిందని గోకవరం క్లస్టర్-1 ఇంచార్జ్ ,రాష్ట్ర కార్యదర్శి, కొత్తపేట నియోజవర్గ టిడిపి పరిశీలకులు కన్నబాబు తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా 12 దేశాలలో మహానాడు చాలా గొప్పగా నిర్వహించబడిందనీ,18 లక్షల పైగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు, 25 లక్షల మంది డిజిటల్ గా తిలకించాలని తెలిపారు. తెలిపారు.జగ్గంపేట నియోజకవర్గంలోని క్లస్టర్ -1 వర్చువల్ మహానాడును క్లస్టర్ లోని నాయకులందరూ సమిష్టిగా విజయవంతం చేయడం జరిగిందని తెలిపారు..కార్యకర్తలు, నాయకులు ఎంతో ఉత్సాహంగా పోటీ పడుతూ మహానాడు విజయవంతనికై ప్రతీ ఒక్కరూ ఎంతో కృషి చేయడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1875క్లస్టర్లలో స్థానిక నాయకత్వం సమర్థవంతంగా నిర్వహించి, తమ నాయకత్వ లక్షణాలను మెరుగుపరచుకోవడం జరిగిందని కన్నబాబు తెలిపారు. నాయకులు సమిష్టి వలనే మహానాడు విజయానికి ప్రధాన కారణమన్నారు. శాసనసభ్యులు, టిటిడి బోర్డు మెంబర్, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు చేతుల నెహ్రూ జగ్గంపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని,ప్రతి కార్యకర్త ,నాయకుడు సగర్వంగా చెప్పుకునే విధంగా పాలన కొనసాగిస్తున్నారని ఇదే మనందరికీ ఎంతో గర్వకారణమన్నారు. కాకినాడ పార్లమెంటరీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ టిడిపి బలోపేతానికై ప్రతి కార్యకర్తకు నిత్యం అందుబాటులో ఉంటున్నారని కన్నబాబు తెలిపారు.

## మహానాడులో
## ముస్లిం మహిళ ప్రత్యేక ఆకర్షణ.



కుప్పం, మే -29(ప్రజా ప్రతిభ):

కుప్పం పట్టణంలోని 11వ క్లస్టర్ పరిధిలో కన్యకా పరమేశ్వరి సత్రంలో నిర్వహించిన మహానాడు కార్యక్రమంలో ముస్లిం మహిళ పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారని 11వ క్లస్టర్ ఇంచార్జ్ కన్నన్ తెలిపారు.బక్రీదు పండుగ సందర్భంగా తన పిల్లలతో కలిసి మహానాడు కార్యక్రమానికి హాజరైన ఆమె అటెండెన్స్ నమోదు చేయించుకుని పార్టీ నాయకులతో కలిసి కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా "మాకు బక్రీదు పండుగ ఎంత ముఖ్యమో, మహానాడు కూడా అంతే పండుగలా భావిస్తున్నాం" అంటూ ఆనందం వ్యక్తం చేశారు.అనంతరం పార్టీ నాయకులు ఆమె ఇంటివద్దకు వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా 11వ క్లస్టర్ ఇంచార్జ్ కన్నన్ మైనారిటీ మహిళా తల్లికి పాదాభివందనం చేసి ఆమె ఆశీర్వాదం పొందడం జరిగింది.కార్యక్రమంలో నాయకులుమాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు తెలుగుదేశం పార్టీకి అండగా నిలవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. పార్టీ ఆశయాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లేందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు,టిడిపి కుటుంబ సభ్యులు,మహిళలు,యువత, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గంగవరం క్రికెట్ టోర్నమెంట్ కు
## "కంబాల" 30 వేలు రూపాయలు ప్రైజ్ మనీ అందజేత

గోకవరం మే 29 (ప్రజా ప్రతిభ న్యూస్)

పోలవరం జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం, గంగవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోజీపీఎల్ సీసన్-7, శ్రీ కలుముల కామరాజు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్స్, విజేతలకు బహుమతులు పంపిణీ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది.బిఈ కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు తరుపున రామసేన సభ్యులు, బీజేపీ నాయుకులు ముఖ్య అతిధిగా హాజరైయ్యారు.ఈ క్రికెట్ టోర్నమెంట్ కు కంబాల శ్రీనివాసరావు మొదటి ప్రైజ్ మనీ 30,000 రూపాయలు అందజేశారు.ఆయన అందుబాటులో లేకపోవడం ఆయన తరుపున రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు విజేతలకు ప్రైజ్ మనీ, ట్రోఫీని పంపిణీ చేసారుఈ సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు, యువసేన యూత్ సభ్యులు మాట్లాడుతూ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించే ముందు, కంబాల శ్రీనివాసరావు వద్దకు వచ్చి గంగవరం గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, సహకారం అందించాలని కోరగా స్పందించిన ఆయన టోర్నమెంట్ నిర్వహించుకోండి అని భరోసా కల్పించి, మొదట ప్రైజ్ మనీ 30,000 రూపాయలు తానే ఇస్తానని ప్రకటించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారుఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, గ్రామస్తులు, క్రీడాకారులు, యువత తదితరులు పాల్గొన్నారు




## అందరూ తప్పక వైద్య పరీక్షలు చేయించుకోవాలి
### మండల పార్టీ అధ్యక్షులు రాజగోపాల్.

కుప్పం, మే-29(ప్రజా ప్రతిభ):

సంజీవిని కార్యక్రమంలో భాగంగా కుప్పం నియోజకవర్గ పరిధిలోని మారుమూల గ్రామాల్లో సైతం ప్రజలు తప్పనిసరిగా అందరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలుగుదేశం పార్టీ కుప్పం మండల పార్టీ అధ్యక్షులు రాజగోపాల్ పేర్కొన్నారు. కుప్పంమండల పరిధిలోని గరిగచీనేపల్లిలో టాటా సంజీవిని పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకొని తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని తద్వారా మెరుగైన వైద్యం పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## స్టర్ ఇంచార్జ్ లను ఘనంగా
# సన్మానించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

గోకవరం మే 29 (ప్రజా ప్రతిభ న్యూస్)

కేంద్ర టిడిపి పార్టీ ఆదేశానుసారం జగ్గంపేట నియోజవర్గంలో మహానాడు విజయవంతం చేసిన క్లస్టర్ ఇంచార్జ్ లను ఎమ్మెల్యే, టిటిడి బోర్డు మెంబర్, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ ఘనంగా సన్మానించారు. వీరితో పాటుగా మండల పార్టీ అధ్యక్షులను సన్మానించడం జరిగింది. ఇందులో భాగంగా గోకవరం మండలం గోకవరం మండలం క్లస్టర్ ఇంచార్జ్ లు కన్నబాబును, అడపా భరత్ కుమార్ ను, జాస్తి వసంతను, పాలకుర్తి ఆదినారాయణ ను, బసవ సూర్య ప్రకాష్ రావు (చినబాబు), దేవరపల్లి మూర్తిని, పాఠం శెట్టి మురళి కృష్ణను, కుర్ల చినబాబును ఎమ్మెల్యే టిటిడి బోర్డు మెంబర్ టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా పార్లమెంటరీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ మరియు నియోజవర్గ టిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు. వారితోపాటు మండల అధ్యక్షులు జీను మణిబాబును, పిల్ల చంటిబాబును, వీరం రెడ్డి కాశి బాబును, పోతుల మోహన్రావును ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ కష్టపడిన వారికి పార్టీలో ఎప్పుడో గుర్తింపు ఉంటుందని, కష్టపడిన వారిని సన్మానించడం అంటే మనలను మనమే సన్మానించుకోవడమని ఇది ఎంతో మంచి సాంప్రదాయమని నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి, మండల స్థాయి టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



ప్రజా ప్రతిభ
ఆంధ్రప్రదేశ్ జిల్లాలు
AndhrapradeshDistricts

Praja Pratibha Telugu Daily

www.prajapratibha.in Prajapratibha.2013@gmail.com

శనివారం
మే 30 2026

## శెట్టివారిపల్లి లో పౌర హక్కుల దినోత్సవం సమావేశం నిర్వహించిన ఎస్ ఐ మారెప్ప



**పెద్దపంజాణి మే 29(ప్రజాప్రతిభ).**

పెద్దపంజాణి మండలం శెట్టివారిపల్లి గ్రామంలో ఈ రోజు పౌర హక్కుల దినోత్సవం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఓ, ఎంపీడీఓ, ఎంఈఓ, ఏపీఓ, ఏఈతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.సమావేశంలో ప్రజల హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు మరియు ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించారు. అధికారులు ప్రజలకు ప్రభుత్వ సేవలను సమర్థవంతంగా అందించేందుకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పంజాణి పోలీస్ స్టేషన్ ఎస్ఐ కూడా పాల్గొని ప్రజలు చట్టాలను పాటిస్తూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు మరియు అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

## దుకాణాలలో లీగల్ మెట్రాలజీ శాఖ తనిఖీలు



**పెద్దపంజాణి మే 29(ప్రజాప్రతిభ).**

పెద్దపంజాణి మండల కేంద్రంలోని పలు దుకాణాలలో పలమనేరు తూనికలు కొలతల శాఖ ఇన్స్పెక్టర్ రమాదేవి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లో వినియోగదారులకు ఎమ్మార్పీ ధరలకే వస్తువులు విక్రయించాలని వ్యాపారులకు సూచించారు.అలాగే ప్రతి వస్తువుపై తయారీ తేదీ, గడువు తేదీ మరియు ధర వివరాలు స్పష్టంగా ఉండాలని తెలిపారు. తూనికలు కొలతల శాఖ అనుమతి పొందిన తూనిక యంత్రాలనే వినియోగించాలని, వినియోగదారులను మోసం చేసే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.నిబంధనలు ఉల్లంఘించిన దుకాణదారులపై జరిమానాలు విధిస్తామని ఇన్స్పెక్టర్ రమాదేవి స్పష్టం చేశారు. ఈ తనిఖీలతో వ్యాపారుల్లో అప్రమత్తత పెరిగింది.

## వీఆర్వో ను సత్కరించిన మండల వైసిపి నాయకులు



**బంగారుపాళ్యం మే 29.(ప్రజా ప్రతిభ)**

చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజవర్గం బంగారు పాళ్యం మండల కేంద్రంలో పదవి విరమణ చేసిన విఆర్ఓ రామకృష్ణ మరియు వారి కుటుంబ సభ్యులను బంగారుపాళ్యం మండల వైఎస్సార్సీపీ నాయకులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సోషల్ మీడియా సంయుక్త కార్యదర్శి కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, తాను మండల పరిధిలో విఆర్ఓ గా పనిచేసి రెవిన్యూ పట్ల స్థానిక ప్రజలకు రైతులకు ఎన్నో మంచి పనులు చేశారని అటువంటివారు పదవి విరమణ పొందడం పట్ల అందరిని కలచి వేసిందని బడుగు బలహీన వర్గాలకు కూడా ఎన్నో మంచి పనులు చేశారని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో తగ్గువారి పల్లి స్థానిక ఎంపీటీసీ హేమచంద్ర,చిత్తూరు జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ మునేంద్ర,తగ్గువారి పల్లి బీసీ యువనాయకులు జగదీష్,వెంకటగిరి మాజీ ఉపసర్పంచ్ కుమారస్వామి,మొగిలి సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జీ ఎంట్రన్స్ పరీక్షల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల కుప్పం విద్యార్థుల విజయకేతనం

**కుప్పం, మే -29(ప్రజా ప్రతిభ):**

శుక్రవారం రాష్ట్రస్థాయిలో జరిగిన పీజీ ఎంట్రెన్స్ పరీక్ష ఫలితాలను విడుదల చేయగా ఎం. ఎ తెలుగు ఎంట్రన్స్ పరీక్షల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కుప్పం విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ద్వితీయ ర్యాంకు, తృతీయ ర్యాంకులు ఎన్ ఇందు 95 వ ర్యాంక్ సాధించడం కళాశాలకు ఎంతో గర్వకారణమని కళాశాల ప్రిన్సిపల్ ఎల్.బి. ప్రదీప్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు శాఖ ఆధ్వర్యంలో విభాగాధిపతి డాక్టర్ ఏ. చంద్రబాబు పర్యవేక్షణలో ఎం.ఏ తెలుగు ఎంట్రెన్స్ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ నిర్వహించడం వల్ల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించగలిగారని పేర్కొన్నారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన తెలుగు శాఖ అధ్యాపక బృందాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.తెలుగు విభాగాధిపతి డాక్టర్ కె. చంద్రబాబు గారు మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపల్ గారి ప్రోత్సాహం, అధ్యాపక బృందం సమిష్టి కృషి వల్లే ఈ విజయం సాధ్యమైందన్నారు. చిత్తూరు జిల్లాలో బి.ఏ స్పెషల్ తెలుగు గ్రూప్ మా కళాశాలలో కొనసాగడం ఎంతో ఆనందదాయకమని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు దేవర్ధన్ ద్వితీయ ర్యాంకు, ఆశ మూడవ ర్యాంకు సాధించడం జరిగింది ఈ సందర్భంగా విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా సి రాజ్యలక్ష్మి తెలుగు అధ్యాపకులు డా. జి. నాగరాజు, శ్రీ డి. ఈశ్వరాచారి విద్యార్థులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. కళాశాల విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.







# పోలవరం ప్యాకేజీలో రూ. 100 కోట్లు

**విచారణ జరిపి నిధులు రికవరీ చేయాలని**

**ఆదివాసీ సంఘాల డిమాండ్**

**పోలవరం అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ (ఐఏఎస్ అధికారి) కు వినతిపత్రం అందజేసిన ఆదివాసీ నాయకుడు జె ఎ సి మండల కార్యదర్శి యలగాడ నాగేశ్వరరావు రామన్న దొర రాష్ట్ర కార్యదర్శి**



**దేవీపట్నం మే 29**

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు పరిధిలోని దేవీపట్నం మండలం మంటూరు రెవెన్యూ గ్రామంలో సుమారు రూ. 100 కోట్ల విలువైన భారీ భూ కుంభకోణం జరిగిందని, దీనిపై తక్షణమే ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపి నిందితుల నుండి నిధులు రికవరీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ జేఏసీ మండలం కార్యదర్శి నాయకులు యాలగాడ నాగేశ్వరరావు నేడు పోలవరం అడ్మినిస్ట్రేషన్ అధికారికి అధికారికంగా వినతిపత్రం సమర్పించారుఈ సందర్భంగా ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ దేవీపట్నం మండలంలోని మంటూరు గ్రామానికి చెందిన ఆదివాసీలకు చెందాల్సిన 417.91 ఎకరాల ప్రభుత్వ బంజరు భూములు, మరియు ఎల్టీఆర్ (రూ=) కోర్టు పరిధిలో విచారణలో ఉన్న భూములకు సంబంధించి గత వైఎస్సార్సీపీ నాయకులు రాజకీయ అండదండలతో అక్రమంగా పోలవరం ప్యాకేజీ (పరిహారం) పొంది దోచుకున్నారని ఆరోపించారు



**కుంభకోణం ప్రధానాంశాలు**

అక్రమంగా కాజేసిన సొమ్ము ఎల్ఎమ్సి యూనిట్-1 ( రాజమహేంద్రవరం అధికారుల నుండి మోసపూరితంగా రూ 12,53,91,000/- (పన్నెండు కోట్ల యాభై మూడు లక్షల తొంభై ఒక్క వేల రూపాయలు) లబ్ధిదారులు కాని వారు దక్కించుకున్నారు.

ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు దేవీపట్నం మండలానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకులు 1) పోలిశెట్టి శివరామకృష్ణ (రా/శీ నాగేశ్వరరావు), 2) నామో రాంబాబు (రా/శీ వరదరామయ్య) తమ రాజకీయ బలంతో అధికారులపై ఒత్తిడి తెచ్చి ఈ ప్రజా ధనాన్ని దారి మళ్లించారు

భూముల వివరాలు మొత్తం 417.97 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ఉన్న ప్రభుత్వ మరియు 63/201 నుండి 148/2011 వరకు గల వందలాది రూ= కేసుల పరిధిలోని భూములపై అక్రమంగా అవార్డులు సృష్టించి ఈ స్కామ్‌కు పాల్పడ్డారు

**ఆదివాసి నాయకులు చేస్తున్న డిమాండ్లు**

మోసపూరితంగా కాజేసిన రూ. 12.53 కోట్లను మరియు దానికి సంబంధించిన పూర్తి నష్టపరిహారం సొమ్మును సదరు వ్యక్తుల నుండి తక్షణమే రికవరీ చేయాలిప్రభుత్వ బంజరు మరియు ఆదివాసీల భూములను కొల్లగొట్టిన నిందితులపై కఠినమైన చట్టపరమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలిఈ అవినీతికి సహకరించిన అధికారులపై కూడా శాఖాపరమైన విచారణ జరిపించాలిఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మరియు ఆదివాసీ జేఏసీ ప్రతినిధులు, బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అధికార యంత్రాంగం స్పందించి ఆదివాసీలకు న్యాయం చేయకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని నాయకులు హెచ్చరించారు

# ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలి

**గో సంరక్షకుల ముసుగులో**

**సాగుతున్న హింసకు అడ్డుకట్ట వేయాలి**

**మస్జిద్-ఏ-మహబూబ్ ముతవల్లి సౌదీ చాంద్**

**నందికొట్కూరు, మే 29, (ప్రజా ప్రతిభ):**

ఆవును జాతీయ జంతువుగా ప్రకటించాలని మస్జిద్-ఏ- మహబూబ్ కమిటీ ముతవల్లి, షేహెరే జమీయత్-ఏ-అహ్లెహదీస్ నాయబ్ అమీర్ సౌదీ చాంద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఒక ప్రకటనలో సౌదీ చాంద్ మాట్లాడుతూ అవును జాతీయ జంతువుగా ప్రకటిస్తే, గో సంరక్షణ చట్టాల్లో ఏకరూపతకు దారితీయడంతోపాటు గో సంరక్షకుల ముసుగులో సాగుతున్న హింసకు అడ్డుకట్ట పడుతుందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం పులికి జాతీయ జంతువుగా గుర్తింపు ఉందని, ఆవుకు అటువంటి స్థాయి ఏదీ లేదని, ఆవుకు జాతీయ



జంతువు హోదా కల్పించాలని డిమాండు చేశారు. ఆవును బలి ఇవ్వాలని ఏ మత గ్రంథమూ చెప్పడం లేదని, తోటి పౌరులకు బాధ కలిగించే చర్యలకు పాల్పడాల్సిన పనిలేదని పేర్కొన్నారు. జాతీయ జంతువుగా ప్రకటిస్తే ఆవును కొనడం కానీ అమ్మడం కానీ నేరం అని అందరికీ తెలుస్తుందన్నారు. అలా ప్రకటించడం వల్ల ఏ రాజకీయ పార్టీలు, మతతత్వ పార్టీలు దీని ద్వారా లబ్ధి పొందడానికి అవకాశం ఉండదన్నారు. ముస్లిం సమాజం కూడా ఆవును కోయకూడదని నిర్ణయించారని అన్నారు. ఆవును జాతీయ జంతువుగా ప్రటికంచాలని డిమాండ్ చేస్తున్నట్టు సౌదీ చాంద్ తెలిపారు.

# గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన సింగారి అనంతయ్య

**రెండు వేల మందిలో ప్రతిభ చూపిన నందికొట్కూరు వాసి**

**హైదరాబాద్ లో గిన్నిస్ పత్రాలు అందుకున్న అనంతయ్య**



**నందికొట్కూరు, మే 29, (ప్రజా ప్రతిభ) :**

ఫిబ్రవరి 2న, 2026 హైదరాబాద్ లో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు ఆధ్వర్యంలో హల్లెల్ మ్యూజిక్ స్కూల్ గిన్నిస్ కీ బోర్డ్ వారి ఆధ్వర్యంలో వాయిద్య కారులు కీబోర్డ్ ఆగకుండా వాయించే పోటీలను నిర్వహించారు. పోటీల్లో 22 దేశాల నుండి దాదాపు 2 వేల మంది పాల్గొనగా అందులో 777మంది ఎంపికయ్యారు. అందులో అనంతయ్య ఎంపికై హల్లెల్ మ్యూజిక్ స్కూల్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించారు. నందికొట్కూరు కు సింగారి శేషయ్య, గ్రేసమ్మ దంపతుల కుమారుడు సింగారి అనంతయ్య. ప్రైవేట్ ఉద్యోగం చేస్తారు. ఈయనకు కీ బోర్డ్ వాయిద్యముపై మంచి పట్టు ఉంది. అయితే ఫిబ్రవరి 2, 2026న హైదరాబాదులో గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధుల ఆద్వర్యం కీ బోర్డ్ వాయిద్యం పోటీలను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించారు. ఈ బృహత్తర కార్యక్రమంలో 22 దేశాల నుండి 2వేల మంది పాల్గొని కీబోర్డ్ వాయిద్యకారులు గంటపాటు కీబోర్డ్ ఆగకుండా వాయిస్తూ పాల్గొన్నారు. అందులో కీబోర్డ్




వాయించడంలో 777 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఇందులో నందికొట్కూరు కు చెందిన సింగారి అనంతయ్య ఉత్తమ ప్రతిభ కనపరచడంతో గిన్నిస్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కు ఎంపికయ్యారు. ఎంపికైన అనంతయ్యను ఈ స్కూలు వ్యవస్థాపకులు అగస్టిన్ దండింగి హైదరాబాద్ లో శుక్రవారం విక్టోరియా ఆడిటోరియం గచ్చిబౌలి లోని హల్లెల్ మ్యూజిక్ స్కూల్ ప్రాంగణంలో గిన్నిస్ 'అచీవర్స్ మీట్ లో సర్టిఫికేట్లు అందజేసి అభినందించారు. హల్లెల్ మ్యూజిక్ స్కూల్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన శుభ సందర్భముగా న అనంతయ్యను మిత్రులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు.

# శ్రామికులకు ఉపశమనం కల్పించిన జనసేన నేతలు

**పాయకరావుపేట ఇంచార్జ్ గెడ్డ బుజ్జి**

**సూచనల మేరకు మజ్జిగ, పండ్లు పంపిణీ**



**నక్కపల్లి, మే 29, (ప్రజా ప్రతిభ)**

ఎండ తీవ్రతతో అల్లాడుతున్న శ్రామికులకు ఉపశమనం కలిగించేందుకు జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో పాయకరావుపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ గెడ్డం బుజ్జి సూచనలు మేరకు నక్కపల్లి మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం విబి-జి రాంజీ (వికసిత్ భారత్ -- గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ -- గ్రామీణ్) శ్రామికులకు మజ్జిగ ప్యాకెట్లు, బిస్కెట్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు.మండల అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమంనక్కపల్లి జనసేన మండల అధ్యక్షుడు



వెలగా సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనసేన మండల ఉపాధ్యక్షులు నల్లల రత్నాజీ, మండల ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్యామ్ కిషోర్, ఉద్దండపురం జనసేన గ్రామ శాఖ అధ్యక్షుడు అమలకంటి హరికృష్ణ, మండల సహాయ కార్యదర్శి దేవవరపు ఉమా మహేష్, తో పాటు పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వెలగా సుధాకర్ మాట్లాడుతూ, అధినేత ఆదేశాలతో, ఇంచార్జ్ సూచనలతో ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని శ్రామికులకు కొంత ఉపశమనం కలిగించేందుకే ఈ కార్యక్రమం నిర్వహించమని జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తూ, శ్రామికుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుంది" అని సుధాకర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## విద్యుత్ సమస్యతో
# ఐదు రోజులుగా నీటి సరఫరాకు అంతరాయం

### మాజీ ఎంపీటీసీ ఆధ్వర్యంలో
### మూడో రోజూ ట్యాంకర్ల ద్వారా నీటి పంపిణీ





**నక్కపల్లి, మే 29, (ప్రజా ప్రతిభ) :**

గ్రామంలో విద్యుత్ సమస్య కారణంగా గత ఐదు రోజులుగా రెగ్యులర్ నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఫిషర్‌మెన్ కాలనీ మినహా గ్రామం మొత్తం, జగనన్న కాలనీతో సహా తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో మాజీ ఎంపీటీసీ గింజల వెంకటరమణ ఆధ్వర్యంలో మూడో రోజు కూడా ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా నిర్విరామంగా నీటి పంపిణీ కొనసాగుతోంది. ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు మండుటెండను సైతం లెక్కచేయకుండా నీటి సరఫరా చేస్తున్న ట్రాక్టర్ ట్యాంకర్ యజమాని, డ్రైవర్ గజ్జి తాతబాబును, ఆయనకు పూర్తి సహకారం అందిస్తున్న కొల్లి శ్రీను అలియాస్ సమరసింహారెడ్డిని మాజీ ఎంపీటీసీ గింజల వెంకటరమణ డీఎల్‌పురం గ్రామ ప్రజల తరఫున ప్రత్యేకంగా అభినందించారు. ఇప్పటికైనా ఎలక్ట్రికల్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో వ్యవహరించి గ్రామంలో నిలిచిపోయిన తాగునీటి సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించాలని మాజీ ఎంపీటీసీ గింజల వెంకటరమణతో పాటు గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## ప్రభుత్వ ఐ. టీ. ఐ లో కిశోరి వికాస కార్యక్రమం...



**వెంకటగిరి, మే29(ప్రజా ప్రతిభ ):**


ఐ. సి.డి. యస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం వెంకటగిరి ప్రభుత్వ ఐ. టీ. ఐ కిశోర బాలురలకు స్కిల్ డెవలప్మెంట్ పై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం కు ముఖ్య అతిథిగా జిల్లా కో -ఆర్డినేటర్ కృష్ణ మంజరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మారక ద్రవ్యలు, డ్రగ్స్ వాడకం ద్వారా కలిగే ఇబ్బందులను తెలిపారు. అలాగే ఫాక్స్ యాక్ట్ గురించి అవగాహనా కల్పించారు. సి. డి . పి. వో శంషాద్ బేగం మాట్లాడుతూ సమాజంలో వ్యక్తిగత, సామాజిక ఎదుగుదల ముఖ్యమని తెలిపారు. బాల్య వివాహాలలు నిర్మూలన, నైపుణ్యభివృద్ధి పై అవగాహనా కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ గీత,కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

# మైనారిటీ విభాగ నేతకు డాక్టరేట్, ఘన సన్మానం..

### విద్యా సేవలకు గుర్తింపుగా అరుదైన గౌరవం..
### గిద్దలూరు నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కె.పి. నాగార్జున రెడ్డి..

**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 29, (ప్రజా ప్రతిభ):**

రాష్ట్ర మైనారిటీ విభాగ కార్యదర్శి ఎంజి అబ్దుల్ గఫార్ ఖాన్‌కు డాక్టరేట్ లభించిన సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కె.పి. నాగార్జున రెడ్డి ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో రెండు దశాబ్దాలకు పైగా విద్యా, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ విశిష్ట సేవలు అందిస్తున్న ఎంజి అబ్దుల్ గఫార్ ఖాన్‌కు ఈ అరుదైన గుర్తింపు లభించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. విద్యా రంగంలో చేసిన కృషికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. మహబూబ్ ఖాన్ ఘోరి విద్యా, గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గత 25 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యా వికాసం కోసం సేవలు అందిస్తున్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో 2008లో ఎంజి విద్యా కళాశాలను స్థాపించారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తూ విద్యా సేవలను విస్తృతంగా కొనసాగిస్తున్నారు. విద్యార్థుల్లో విద్యాపట్ల ఆసక్తి పెంపొందించడం, గ్రామీణ ప్రాంతాల్లో విద్యా చైతన్యం తీసుకురావడం, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈ సేవలను గుర్తిస్తూ మే 24న చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో అంతర్జాతీయ తమిళ సాంస్కృతిక విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టరేట్ అందుకున్న అనంతరం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో కె.పి. నాగార్జున రెడ్డి మాట్లాడుతూ, విద్యా సేవల ద్వారా సమాజానికి సేవ చేయడం గొప్ప విషయం అని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎంజి అబ్దుల్ గఫార్ ఖాన్ చేస్తున్న కృషి ఆదర్శనీయమని కొనియాడారు. ఈ గుర్తింపు మరింత సేవ చేయడానికి ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గొంగటి చెన్నారెడ్డి, చేగిరెడ్డి ఓబుల్ రెడ్డి, రాష్ట్ర యువజన విభాగ కన్వీనర్ నెమలిదిన్నె చెన్నారెడ్డి, కంభం పట్టణ ఉప సర్పంచ్ సయ్యద్ ఖాసిం, కంభం పట్టణ అధ్యక్షుడు షేక్ డిష్ మున్న, లింగోజిపల్లి నాయకుడు సయ్యద్ ఖాసింవలి జగన్ తదితరులు పాల్గొన్నారు. విద్యా రంగంలో సేవ చేస్తున్న వారికి సమాజం నుంచి ఇలాంటి గుర్తింపులు లభించడం అభినందనీయమని, ఇది మరింత మంది సేవా కార్యక్రమాల వైపు అడుగులు వేయడానికి దోహదపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.



# స్మార్ట్ బజార్ వద్ద పార్కింగ్ సమస్యతో ప్రజలకు ఇబ్బందులు..

### తక్షణమే పరిష్కార చర్యలు
### చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి..


**మార్కాపురం జిల్లా బ్యూరో / లుంజల శేఖర్ , మే 29, (ప్రజా ప్రతిభ):**

మార్కాపురం జిల్లా గిద్దలూరు పట్టణంలోని స్మార్ట్ బజార్ వినియోగదారులకు అన్ని రకాల సౌకర్యాలతో అందుబాటులో ఉన్నప్పటికీ, పార్కింగ్ సమస్య మాత్రం తీవ్ర ఇబ్బందులకు కారణమవుతోంది. రోజురోజుకు పెరుగుతున్న వినియోగదారుల రద్దీకి అనుగుణంగా పార్కింగ్ వసతులు కల్పించకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. లక్షల రూపాయల వ్యాపారం సాగిస్తున్న ఈ వాణిజ్య కేంద్రం, వినియోగదారుల ప్రాథమిక అవసరమైన పార్కింగ్ సదుపాయాన్ని నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. సరుకుల కోసం వచ్చే వాహనాలు రహదారిపైనే నిలిపివేయడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా స్మార్ట్ బజార్‌కు సమీపంలో ఉన్న సూర్య ఆసుపత్రికి వెళ్లే అత్యవసర రోగులకు ఈ పరిస్థితి మరింత ఇబ్బందిగా మారిందని స్థానికులు చెబుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు, ఇతర వాహనాలు సకాలంలో ఆసుపత్రికి చేరుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ నివాసం ఉండే ప్రజలు కూడా వాహనాల రద్దీతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇళ్ల ముందు వాహనాలు నిలిపివేయడం, రాకపోకలకు ఆటంకం కలగడం, ట్రాఫిక్ కిక్కిరిసిపోవడం వంటి సమస్యలు రోజువారీగా ఎదురవుతున్నాయని చెబుతున్నారు. పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలం లేకపోవడం వల్ల వినియోగదారులు ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలిపివేస్తుండటంతో రహదారి సన్నగిల్లిపోతోంది. దీంతో ప్రమాదాలకు అవకాశం పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పరిస్థితిని పరిశీలించాలని, స్మార్ట్ బజార్ యాజమాన్యాన్ని పార్కింగ్ సదుపాయం కల్పించేలా ఆదేశించాలని ప్రజలు కోరుతున్నారు. వినియోగదారుల సౌకర్యంతో పాటు ప్రజల భద్రత, అత్యవసర సేవలకు అంతరాయం కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. వ్యాపార లాభాలకే పరిమితం కాకుండా ప్రజా సౌకర్యాలపై కూడా యాజమాన్యం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపితేనే ప్రజలకు ఉపశమనం కలుగుతుందని చెబుతున్నారు.



# పాలరాతి శిల్పంలా జాన్వీ

## తెల్లని చీరలో అతిలోక సుందరిగా మెరిసిన బాలీవుడ్ భామ
## హొయలు పోతున్న అందాలతో అభిమానులకు విజువల్ ట్రీట్



**టాకీస్:** అందాలతార శ్రీదేవి వారసురాలిగా సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టిన జాన్వీ కపూర్.. నటనతో పాటు గ్లామర్‌తోనూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. తల్లిని తలపించే అందం, అభినయంతో అభిమానులను అలరిస్తున్న ఈ ముద్దుగుమ్మ తాజాగా మరోసారి తన స్టన్నింగ్ లుక్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే జాన్వీ.. ట్రెండీ ఔట్‌ఫిట్స్‌తో ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకోవడంలో ఎప్పుడూ ముందుంటుంది.

తాజాగా ప్రముఖ డిజైనర్ అనామికా ఖన్నా రూపొందించిన తెలుపు రంగు ఐవరీ చీరలో దర్శనమిచ్చి అందరి చూపులు తనవైపు తిప్పుకుంది.

పలుచని తెల్లని వస్త్రంపై హెవీ ఎంబ్రాయిడరీ వర్క్‌తో రూపొందించిన ఈ చీరకు స్కాలప్ లేస్ డిజైన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీనికి జతగా స్లీవ్‌లెస్ హెవీ డిజైన్ బ్లౌజ్ ధరించిన జాన్వీ.. తన అందాలను మరింత హైలైట్ చేసింది.

వేవీ హెయిర్ స్టైల్‌తో పాటు వైట్-గోల్డెన్ మిక్స్ చెవి దిద్దులు ధరించి క్లాసీ లుక్‌లో మెరిసిపోయింది. మెడకు ఎలాంటి ఆభరణాలు ధరించకుండా సింపుల్‌గా కనిపించినా ఆమె గ్లామర్ మాత్రం మరింత ఎలివేట్ అయింది.

ఈ ఫొటోలు చూసిన అభిమానులు "పాలరాతి శిల్పంలా ఉంది", "అచ్చం శ్రీదేవినే గుర్తు చేస్తోంది", "జాన్వీ అందాలకు మాటలు సరిపోవు" అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# హీట్ పెంచేస్తున్న సీరత్..!

**టాకీస్:** 'రన్ రాజా రన్' సినిమాతో తెలుగు ప్రేక్షకుల మనసులు దోచుకున్న గ్లామర్ బ్యూటీ సీరత్ కపూర్ మరోసారి తన అందాల ఆరబోతతో నెట్టింట సెగలు రేపుతోంది. సినిమాల్లో కంటే సోషల్ మీడియాలోనే ఎక్కువగా సందడి చేస్తున్న ఈ భామ తాజాగా షేర్ చేసిన ఫొటోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి.

లాంగ్ లెంగ్త్ స్టైలిష్ డ్రెస్‌లో క్లీవేజ్ షో చేస్తూ హాట్ హాట్ పోజులతో అభిమానులను మంత్రముగ్ధులను చేసింది సీరత్. నడుము అందాలను హైలైట్ చేస్తూ కవ్వించే చూపులతో ఇచ్చిన ఫోజులు కుర్రాళ్ల హృదయాలను దోచేస్తున్నాయి. దీంతో ఈ ఫొటోలకు నెట్టింట భారీ స్పందన వస్తోంది. తెలుగులో తొలి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకున్న సీరత్.. ఆ తర్వాత 'కొలంబస్',

- హాట్ ఫొటో షూట్‌తో సోషల్ మీడియా షేక్
- క్లీవేజ్ షో.. కవ్వించే చూపులతో కుర్రాళ్లకు నిద్రలేకుండా చేస్తున్న భామ



'రాజుగారి గది-2', 'టచ్ చేసి చూడు', 'ఒక్క క్షణం' వంటి చిత్రాల్లో నటించింది. సినిమాలు ఆశించిన విజయాలు అందుకోకపోయినా ఈ అమ్మడి గ్లామర్‌కు మాత్రం ప్రత్యేక ఫ్యాన్ ఫాలోయింగ్ ఏర్పడింది.

ఇటీవల 'భామా కలాపం-2' వెబ్‌సిరీస్‌లో కీలక పాత్రలో కనిపించిన సీరత్ తన నటనతో మరోసారి ఆకట్టుకుంది. అలాగే హిందీలో వచ్చిన 'మారిచ్' క్రైమ్ థ్రిల్లర్‌లోనూ నటించి ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం పెద్ద సినిమాల్లో కనిపించకపోయినా సోషల్ మీడియాలో మాత్రం రెగ్యులర్‌గా అందాల విందు చేస్తూ అభిమానులను అలరిస్తోంది.

తాజా ఫొటో షూట్ చూసిన నెటిజన్లు "ఇంత హాట్‌గా ఉంటే అవకాశాలు ఎలా రావు..?", "సీరత్ గ్లామర్ డోస్ మామూలుగా లేదు" అంటూ కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు మాత్రం ఈ భామకు మళ్లీ టాలీవుడ్‌లో బిజీ రోజులు రావడం ఖాయమంటూ అభిప్రాయపడుతున్నారు.

# సందీప్ రెడ్డి వంగా నిర్మాతగా 'రోమాంచకం'

- యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా 'రోమాంచకం'
- సినిమా టైటిల్ పోస్టర్‌ను విడుదల చేసిన మేకర్స్
- సోదరుడు ప్రణయ్ రెడ్డితో కలిసి చిత్రాన్ని నిర్మిస్తున్న సందీప్ రెడ్డి


**టాకీస్:** టాలీవుడ్‌లో అర్జున్ రెడ్డి చిత్రంతో దర్శకుడిగా తనకంటూ ఓ ప్రత్యేక మార్క్‌ను క్రియేట్ చేసుకున్న సందీప్ రెడ్డి వంగా, బాలీవుడ్‌లో కబీర్ సింగ్, యానిమల్ చిత్రాలతో సన్సేషన్ క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు తాజాగా ఆయన దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా 'స్పిరిట్' అనే చిత్రం తెరకెక్కుతోంది. కాగా సందీప్ రెడ్డి వంగా నిర్మాతగా తన సొంత బ్యానర్‌లో 'రోమాంచకం' అనే సినిమాను నిర్మిస్తున్నారు.

భద్రకాళి పిక్చర్స్ పతాకంపై సందీప్ రెడ్డి వంగా సమర్పణలో ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్న ఈ సినిమాలో సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్నారు. వేణుగోపాల్ రెడ్డి ఈ చిత్రానికి దర్శకుడు. శుక్రవారం ఈ చిత్రం టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు. 'రోమాంచకం' టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రానికి ప్రేమ, హాస్యం, ఉత్కంఠ అనే ట్యాగ్‌లైన్‌ను జోడించారు. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్‌డేట్స్ త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారు.




# పెద్దిలో అప్పలసూరిగా జగపతిబాబు

అప్పలసూరిగా 'పెద్ది'లో తన నటనతో ఆకట్టుకునేందుకు సిద్ధమయ్యారు నటుడు జగపతి బాబు . రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది.



ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న జగపతిబాబు మన కష్టానికి తగిన ఫలితం కచ్చితంగా లభిస్తుందన్నారు. సినిమా రంగంలో ఉన్నంత ఆనందం నాకు ఇంక ఎందులోనూ కనిపించదు. ఇందులో ఏదైనా సాధ్యమవుతుంది. సహజంగా నా జీవితంలో ప్రతిదీ ఆలస్యంగా వస్తుంది. కెరీర్‌లో కూడా మొదట ఫ్లాప్‌ల నుంచి హిట్‌లకు వచ్చాను. అందుకే పరాజయాలను పెద్దగా పట్టించుకోను. ఏదో ఒకరోజు విజయం తప్పక వస్తుంది నమ్ముతా. జీవితం మన అంచనాలకు అందదు. తర్వాత ఏం జరుగుతుందో ఎవరికీ తెలీదు. కానీ, ప్రతి ఒక్కరికి కష్టాలు కామన్‌గా ఉంటాయి. నేనూ ఎన్నో కష్టాలు పడ్డాను. ఇలా జరిగిందేంటని ఎప్పుడూ బాధపడలేదు. వాటి నుంచి ఏదో కొత్త పాఠం నేర్చుకున్నాను. కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుందని ఎప్పుడూ నమ్ముతాను. బాధ వెనక సంతోషం కచ్చితంగా ఉంటుంది. నేను 2011 నుంచి 2013 వరకు ఎంతో బాధ అనుభవించా. దానికి తగిన సంతోషం ఇప్పుడు వచ్చింది. నా టైమ్ ఇప్పుడు స్టార్ట్ అయింది అనుకుంటున్నా అని జగపతి బాబు అన్నారు.



## చివరి గంటలో అమ్మకాల సునామీ..

# కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

- భారీ నష్టాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు
- చివరి గంటలో అమ్మకాల ఒత్తిడికి కారణమైన అమెరికా-ఇరాన్ పరిణామాలు
- సెన్సెక్స్ 1092, నిఫ్టీ 359 పాయింట్లు నష్టం
- రుతుపవనాలపై ఐఎండీ అంచనాలతో ఆందోళన చెందిన ఇన్వెస్టర్లు
- మార్కెట్ పతనంలోనూ లాభపడిన ఐటీ షేర్లు

**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాలతో ముగిశాయి. రోజంతా తీవ్ర ఒడిదొడుకులకు లోనైన సూచీలు, ట్రేడింగ్ చివరి గంటలో అమ్మకాల సునామీతో కుప్పకూలాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం కుదరవచ్చన్న వార్తల నేపథ్యంలో నెలకొన్న అనిశ్చితి, ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనికి తోడు రుతుపవనాలపై వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనాలు కూడా అమ్మకాలకు ఆజ్యం పోశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 1,092.06 పాయింట్లు నష్టపోయి 74,775.74 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 359.40 పాయింట్లు పతనమై 23,547.75 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో ఒక దశలో నిఫ్టీ 24,002 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకినా, చివరికి 23,484 కనిష్ఠ స్థాయికి పడిపోయింది. సెన్సెక్స్ కూడా 76,220 గరిష్ఠాన్ని చూసి, ఆ తర్వాత 74,589 స్థాయికి జారుకుంది.

రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.18 శాతం, ఐటీసీ 1.71 శాతం మేర నష్టపోవడం మార్కెట్ పతనాన్ని మరింత వేగవంతం చేసింది. అయితే, ఈ ప్రతికూల మార్కెట్‌లోనూ ఐటీ రంగ షేర్లు రాణించాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 0.60 శాతం లాభపడింది. అమెరికా టెక్ స్టాక్స్‌లో ర్యాలీ, రూపాయి బలహీనపడటం ఐటీ కంపెనీలకు కలిసొచ్చింది. బ్రాడర్ మార్కెట్లలో మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.33 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.85 శాతం మేర నష్టపోయాయి. టెక్నికల్ నిపుణుల అంచనా ప్రకారం, నిఫ్టీ 23,500 స్థాయిని నిలబెట్టుకోలేకపోతే 23,300-23,200 జోన్‌కు పడిపోయే ప్రమాదం ఉంది. పైకి వెళ్లాలంటే 23,750-23,800 స్థాయిని అధిగమించాల్సి ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు.




## రాజస్థాన్‌పై ఘనవిజయం

- ఐపీఎల్ 2026 ఫైనల్ చేరిన గుజరాత్ టైటాన్స్
- క్వాలిఫయర్ 2లో రాజస్థాన్ రాయల్స్‌పై 7 వికెట్ల తేడాతో గెలుపు
- కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అద్భుత సెంచరీ.. సాయి సుదర్శన్ హాఫ్ సెంచరీ
- రాజస్థాన్ బ్యాటర్ సూర్యవంశీ 96 పరుగుల పోరాటం వృథా
- మే 31న ఆర్సీబీతో గుజరాత్ టైటిల్ ఫైట్

# ఫైనల్‌కు దూసుకెళ్లిన గుజరాత్

**స్పోర్ట్స్ (ప్రజా ప్రతిభ):** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో గుజరాత్ టైటాన్స్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన క్వాలిఫయర్-2 మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (104) బాధ్యతాయుతంగా ఆడి అద్భుత సెంచరీతో ఆకట్టుకున్నాడు. సాయి సుదర్శన్ అర్ధసెంచరీతో రాణించాడు. రాజస్థాన్ నిర్దేశించిన 215 పరుగుల భారీ లక్ష్యాన్ని గుజరాత్ మరో 8 బంతులు మిగిలి ఉండగానే కేవలం 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

భారీ లక్ష్య ఛేదనలో గుజరాత్ ఏ దశలోనూ తడబడలేదు. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్ తొలి వికెట్‌కు 167 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పి మ్యాచ్‌ను రాజస్థాన్ నుంచి లాగేసుకున్నారు. ముఖ్యంగా గిల్, రాజస్థాన్ బౌలర్లను ఊచకోత కోశాడు. కేవలం 53 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 104 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మరోవైపు సాయి సుదర్శన్ 32 బంతుల్లో 58 పరుగులు చేశాడు. వీరిద్దరూ అవుటైన తర్వాత రాహుల్ తెవాటియా (17 నాటౌట్) తనదైన శైలిలో మ్యాచ్‌ను ముగించాడు.

అంతకుముందు, టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రాజస్థాన్ రాయల్స్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. కేవలం 9 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే, యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ వీరోచిత ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. కేవలం 47 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్సర్లతో 96 పరుగులు చేసి తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. అతనికి రవీంద్ర జడేజా (45 నాటౌట్) చక్కటి సహకారం అందించాడు. చివర్లో డొనోవన్ ఫెరీరా (11 బంతుల్లో 38) విధ్వంసం సృష్టించడంతో రాజస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 214 పరుగుల భారీ స్కోరు సాధించింది. గుజరాత్ బౌలర్లలో జాసన్ హోల్డర్, కగిసో రబాడ రెండేసి వికెట్లు పడగొట్టారు.

ఈ విజయంతో గుజరాత్ టైటాన్స్ ఫైనల్‌కు అర్హత సాధించగా, రాజస్థాన్ రాయల్స్ ప్రస్థానం టోర్నీలో ముగిసింది. మే 31న (ఆదివారం) జరిగే టైటిల్ పోరులో గుజరాత్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)తో తలపడనుంది.



# వినేశ్ ఫోగట్‌కు సుప్రీంకోర్టులో ఊరట

- ట్రయల్స్‌లో పాల్గొనేందుకు అనుమతి
- రెజ్లర్ పిటిషన్‌పై కీలక వ్యాఖ్యలు చేసిన ధర్మాసనం

**స్పోర్ట్స్ (ప్రజా ప్రతిభ):** భారత మహిళా స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగట్‌కు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఎంపిక ట్రయల్స్‌లో పాల్గొనేందుకు ఆమెకు అనుమతి ఉందని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో వినేశ్‌కు తాత్కాలిక ఉపశమనం లభించినట్లైంది.

రెజ్లింగ్ ఎంపిక ప్రక్రియ, ట్రయల్స్ నిర్వహణకు సంబంధించి దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. క్రీడాకారిణి అవకాశాలను పూర్తిగా నిరాకరించలేమని అభిప్రాయపడింది. ట్రయల్స్‌లో పాల్గొనకుండా అడ్డుకోవద్దని సంబంధిత అధికారులకు సూచించింది. ఈ సందర్భంగా ధర్మాసనం మాట్లాడుతూ.. క్రీడాకారుల భవిష్యత్తు, కెరీర్‌ను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ప్రతిభ ఉన్న ఆటగాళ్లకు సమాన అవకాశాలు కల్పించడం క్రీడా సంఘాల బాధ్యత అని వ్యాఖ్యానించింది.

వినేశ్ ఫోగట్ ఇటీవల రెజ్లింగ్ వ్యవహారాలపై పలు వివాదాల మధ్య వార్తల్లో నిలిచిన విషయం తెలిసిందే. ట్రయల్స్ నిర్వహణ, ఎంపిక విధానంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఆమె న్యాయపోరాటం కొనసాగిస్తోంది.

సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలతో వినేశ్ అభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఇక ట్రయల్స్‌లో ఆమె ప్రదర్శనపై క్రీడాభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

Printed published and own by him Dr. kongarapu Ganapathi, D.No 1/164 Balanki street, paalakonda-532440.
Officeaddress D-NO: 8-33-13, Near Kalabarathi opp com office, pithapuram colony, Maddilapalem visakhapatnam-530003. RNI:APTEL 2013/54721.
Editor in Chief: Danuri Srinivas - 9441500341